నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 10-6-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 271 పేజీలు: 4 వెల: రూ.1/-

ఆగిపోయిన షూటింగ్‌లు చేసుకోవచ్చు

హైదరాబాద్, జూన్ 9: చిత్ర పరిశ్రమను ఆదుకునేందుకు, తిరిగి సినీ నిర్మాణ కార్యక్రమాలను నిర్వహించుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం మరిన్ని సడలింపులు ఇచ్చింది. ఇప్పటికే జీవో నెంబర్ 75 తో షూటింగ్‌లకు సంబందించిన మార్గదర్శకాలను జారీ చేసిన ప్రభుత్వం సినీ పరిశ్రమకు మరింత ఊరటనిచ్చింది.

జీవో నెంబర్ 75 కి మరిన్ని సడలింపులు జోడిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చూసింది ప్రభుత్వం. షూటింగ్ పూర్తి చేసుకున్న సినిమాల పోస్ట్ ప్రొడక్షన్ పనులకు వెంటనే పూర్తి చేసుకునేందుకు అనుమతినిచ్చింది. లాక్‌డౌన్ కారణంగా మధ్యలో ఆగిపోయిన సినిమాలు, టీవీ కార్యక్రమాలను తిరిగి షూటింగ్ మొదలుపెట్టుకునేందుకు అవకాశం ఇచ్చింది ప్రభుత్వం. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ ఉత్తర్వులకు ఈ కొత్త సదుపాయాలను జోడించింది. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు సినిమా హాళ్లకు అనుమతి నిరాకరించింది ప్రభుత్వం.

మిషన్ భగీరథ పనులను వేగవంతం చేయాలి

నిర్మల్, జూన్ 9: జిల్లాలో మిషన్ భగీరథ, డబుల్ బెడ్ రూమ్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

కలెక్టరేట్ సమావేశ మందిరంలో మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ, తహసీల్దార్లతో మిషన్ భగీరథ, డబుల్ బెడ్ రూమ్ పనుల పురోగతిపై నిర్వహించిన సమావేశంలో మంత్రి పాల్గొని సమీక్షించారు. మిషన్ భగీరథ పథకం కింద ఇప్పటివరకు ఎన్ని ఆవాసాలకు బల్క్ నీరు అందించారు. ఎన్ని గ్రామాల్లో పైప్ లైన్ పనులు పూర్తి అయినవి, ఎన్ని ఆవాసాలకు పూర్తిగా నీరు సరఫరా చేస్తున్న వివరాలను మండలాల వారీగా సమీక్షించారు. మిషన్ భగీరథ ఎస్ఈ మాట్లాడుతూ జిల్లాలోని 710 ఆవాసాల్లో 693 ఆవాసాలకు బల్క్ నీరు సరఫరా చేస్తున్నామని నిర్మల్ నియోజకవర్గం లో 212 ఆవాసాలు, ముధోల్ నియోజకవర్గం లో 262, ఖానాపూర్ నియోజకవర్గం లోని 212 ఆవాసాలకు బల్క్ నీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మంత్రి డబుల్ బెడ్ రూమ్ నిర్మాణాల పై మండలాల వారీగా సమీక్షించారు. మండలాల వారీగా కేటాయించిన డబుల్ బెడ్ రూం గృహాల సంఖ్య, నిర్మాణాల కు కావాల్సిన స్థల సేకరణ, ఇప్పటివరకు నిర్మించిన గృహాలపై సమీక్షించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

జ్యోతిరాదిత్య సింధియాకు కరోనా పాజిటివ్

హైదరాబాద్,జూన్ 9: బీజేపీ నేత జ్యోతిరాదిత్య సింధియాకు కరోనా వైరస్ సంక్రమించింది. కరోనా పరీక్షలో ఆయన పాజిటివ్‌గా తేలారు. ఢిల్లీలోని సాకేత్‌లో ఉన్న మ్యాక్స్ హాస్పిటల్‌లో ఆయన పరీక్ష చేయించుకున్నారు. జ్యోతిరాదిత్య సింధియాతో పాటు ఆయన తల్లి మాధవి రాజ్ సింధియాకు కూడా కరోనా వైరస్ సంక్రమించినట్లు పరీక్షలో రుజువైంది. కరోనా లక్షణాలతో బాధపడుతున్న జ్యోతిరాదిత్య.. నాలుగు రోజుల క్రితం మ్యాక్స్ సాకేత్ హాస్పిటల్‌లో చేరారు. జ్యోతిరాదిత్యలో లక్షణాలు ఉన్నా.. ఆయన తల్లిలో మాత్రం లక్షణాలు కనిపించడంలేదు. ఇద్దరూ ప్రస్తుతం ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. బీజేపీ జాతీయ ప్రతినిధి సంబిత్ పాత్రలో కూడా కరోనా లక్షణాలు బయటపడ్డాయి. గూర్గావ్‌లోని మేదాంత హాస్పిటల్‌లో చేరిన ఆయన సోమవారం డిశ్చార్జ్ అయ్యారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌కు కూడా ఇవాళ కరోనా పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే.

నల్లగొండ జిల్లాలో కారు బోల్తా, ఒకరు మృతి

నల్లగొండ,జూన్ 9: కారు బోల్తాపడి ఒకరు మృతి చెందిన సంఘటన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గం పెద్దవూర మండలంలోని పెద్దగూడెం స్టేజి సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిడమనూరు మండలానికి చెందిన సింగం శివ(18), వెంకట్‌నగర్ గ్రామానికి చెందిన వెంకటేష్‌తో కలిసి కారుతో సోమవారం రాత్రి దేవరకొండకు బయలుదేరాడు. పెద్దగూడెం స్టేజి సమీపానికి రాగానే కారు అదుపుతప్పి పల్టీ కొట్టింది.

ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శివను నల్లగొండలోని ప్రభుత్వ దావాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. వెంకటేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ హుస్సేన్ అహ్మద్ తెలిపారు.

శ్మశాన వాటికలా గాంధీ ఆస్పత్రి

అక్కడ సౌకర్యాలు సరిగా లేవన్న ఎమ్మెల్యే రాజాసింగ్

హైదరాబాద్,జూన్9(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కరోనా కేసులు పెరుగుతుంటే...వాటిని కంట్రోల్ చేసేందుకు చర్యలు చేపట్టకుండా కేసీఆర్ తన ఫామ్ హౌజ్ లోనో,ప్రగతి భవన్ లోనో కూర్చుంటే సరిపోదని తెలంగాణ ప్రభుత్వ పాలనపై బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్రంగా విమర్శించారు. అందులోనుంచి బయటకు వచ్చి పరిస్థితిని చూడాలని డిమాండ్ చేశారు. ఒక సారి సీఎం కేసీఆర్ గాంధీ ఆస్పత్రిని దర్శించాలని అది ఆస్పత్రిలా లేదని శ్మశానాన్ని తలపిస్తోందన్నారు. అందులో కరోనా వైరస్ తో ట్రీట్మెంట్ తీసుకుంటున్న బాధితుల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. గాంధీ ఆస్పత్రికి తాను కూడా వస్తానన్న రాజా సింగ్ గ్రౌండ్ లెవల్ కు వెళ్లి చూస్తే కానీ వాస్తవాలు తెలియవన్నారు. ఈ విషయాన్ని తాను రాజకీయం చేయడం లేదని,రాజకీయాల కోసం మాట్లాటం చేయడం లేదని స్పష్టం చేశారు. గాంధీ ఆస్పత్రి కంటే శ్మశానం నయమని జర్నలిస్ట్ మనోజ్ సభ్యులు కూడా అన్నట్లుగా రాజాసింగ్ తెలిపారు . గాంధీ లో ట్రీట్మెంట్ సరిగ్గా జరగడం లేదనడానికి వారి మాటలే సాక్ష్యమన్నారు. సీరియస్ పేషెంట్ లను కూడా పట్టించుకోవడం లేదు. గాంధీ ఆస్పత్రి సరిపోకపోతే ఇతర ప్రభుత్వ ఆస్పత్రులను వాడుకోవాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో అయితే అన్ని సదుపాయాలు కల్పించి వైద్యం చేస్తున్నారన్న రాజా సింగ్, మన రాష్ట్రంలో ఆ పరిస్థితి లేదన్నారు. దీనిపై సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

డబుల్ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

–పనులన్నీ నాణ్యతతో పూర్తి చేయాలి: మంత్రి సత్యవతి

మహబూబాబాద్,జూన్9(ఆర్ఎన్ఎ): జిల్లాలో జరుగుతున్న పలు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని గిరిజన సంక్షేమ శాఖమంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. జిల్లా కేంద్రంలో డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. పేదలకు ఇళ్లు కట్టించాలన్న సిఎం కెసిఆర్ ఆకాంక్షను త్వరగా నెరవేర్చాలన్నారు. పేదలకు గతంలో ఇలాంటి ఇళ్లు ఎప్పుడూ నిర్మించి ఇవ్వలేదన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డబుల్ బెడ్ రూం ఇండ్లు త్వరలో ప్రారంభించాల్సి ఉన్నందున పనుల్లో వేగం పెంచాలన్నారు. అలాగే నూతనంగా నిర్మిస్తున్న ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ నిర్మాణం కోసం ప్రభుత్వ భూమిని, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ అదనపు గదుల నిర్మాణం, జిల్లా పోలీస్ కార్యాలయం, ప్రభుత్వ దవాఖాన, కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యే శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్, ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి, జడ్పీ చైర్ పర్సన్ అంగోతు బింధు, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తిగత రక్షణతోనే కరోనాకు చెక్

ప్రజలు,వాహనదారులు నిబంధనలు పాటించాలి: మంత్రి

మహబూబ్ నగర్,జూన్9(ఆర్ఎన్ఎ): లాక్‌డౌన్ సడలింపుల తర్వాత కరోనా వైరస్ వ్యాప్తి కొనసాగుతున్న తరుణంలో.. వాహనదారులు ప్రభుత్వ నియమాలను పాటిస్తున్నారా లేదా అని మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ ఆరా తీసారు. ప్రజలంతా రక్షణ చర్యలు తీసుకోవాలని, వామనదారులు నిబంధనలు పాటించాలని అన్నారు.

మహబూబ్‌నగర్ పట్టణంలోని న్యూ టౌన్ చౌరస్తా వద్ద మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు. ద్విచక్ర వాహనదారులు, ఆటో, కార్లు, బస్సులలో ప్రయాణిస్తున్న వారితో మాట్లాడారు. మాస్కులు ధరించడంలో నిర్లక్ష్యంగా ఉండకూడదని మంత్రి సూచించారు. మాస్కులు లేకుండా రోడ్లపైకి వచ్చే వాహనదారులపై కఠినంగా వ్యవహరించాలని పోలీస్‌లకు సూచించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండి కరోనా వ్యాప్తిని అడ్డుకోవాలని ఆయన సూచించారు. కరోనా నియంత్రణలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు నియంత్రణ కూడా అవసరమన్నారు. ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకున్నా మనం కూడా అందుకు తగ్గట్లుగా వ్యవహరించాలన్నారు.

తప్పించుకున్న చిరుత మళ్లీ సంచారం

వ్యవసాయవర్సిటీ ప్రాంతంలో ఉన్నట్లు గుర్తింపు సిసి కెమెరాల్లో నమోదయిన చిరుత కదలికలు

హైదరాబాద్,జూన్9(ఆర్ఎన్ఎ): నగర శివార్లలోని కాటేదాన్‌లో నెల రోజుల క్రితం కలకలం రేపిన చిరుతపులి మరోమారు తన ఉనికిని చాటుకుంది. నెల రోజులుగా కనిపించకుండా తిరుగుతున్న చిరుతపులి.. రాజేంద్రనగర్‌లోని జయశంకర్ వ్యవసాయ వర్సిటీ పరిసరాల్లో సంచరించినట్లు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యింది. సోమవారం రాత్రి విశ్వవిద్యాలయ సమీపంలోని నారం ఫామ్‌హౌస్‌లోని ఓ ఇంట్లోకి వచ్చిన చిరుత.. కిటికీ ఎక్కి ఇంట్లోకి తొంగిచూస్తున్నట్లు కెమెరాల్లో నమోదయ్యింది. దీంతో స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందిచారు. చిరుతను వెంటనే బంధించాలని కోరుతున్నారు. గత నెల 14న రంగారెడ్డి జిల్లా కాటేదాన్ రైల్వే అండర్‌పాస్ వద్ద ఉదయం 6 గంటల సమయంలో రోడ్డుపై కనిపింది. అటునుంచి పక్కనే ఉన్న ఓ తోటలోకి పారిపోయిన చిరుత పులి వ్యవసాయ యూనివర్సిటీ, పోలీస్ అకాడమీ పరిసరాల్లో తిరుగుతున్నది. మే 16న హిమాయత్ సాగర్ వద్ద నీళ్లు తాగుతుండగా స్థానిక మత్స్యకారులు గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. జూన్ 3న వ్యవసాయ వర్సిటీ ఆరణలో తిరిగినట్లు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యింది. దీంతో అటవీశాఖ అధికారులు చిరుతను పట్టుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. చిరుత సంచారంతో ఉద్యోగులు, స్థానికుల్లో భయాందోళన నెలకొంది.

చురుకుగా రుతుపవనాలు

నేడు తెలంగాణను తాకే అవకాశం

హైదరాబాద్,జూన్9(ఆర్ఎన్ఎ): జూన్ 1న కేరళను తాకిన నైరుతి రుతుపవనాలు చురుకుగా కదులు తున్నాయి. కర్ణాటక, ఏపీ దాటుతూ తెలంగాణ వైపు పయనిస్తున్నాయి. రుతుపవనాల కారణంగా ఇప్పటికే బెంగాల్, తమిళనాడు తదితర ప్రాంతాల్లో రుతుపవనాలు విస్తరించడంతో వర్షాలు కురిశాయి. ఇక తెలుగు రాష్ట్రాల్లో కూడా అక్కడక్కడ భారీగా వర్షాలు కురిశాయి. ఇక బుధవారం నాటికి మహారాష్ట్ర, కర్ణాటక లతో పాటు ఇతర ప్రాంతాల్లో కూడా రుతుపవనాలు విస్తరించి ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇక తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనంతో మంగళవారం రాష్ట్రం లోని కొన్ని చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. బుధవారం నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశిస్తుందటంతో చాలా చోట్ల తొలకరి వర్షాలు కురియనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, 47-56 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. అలాగే మత్స్యకారులు సైతం చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. కృష్ణా, గుంటూరు, మరి కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

వలసకూలీలపై కేసులు ఎత్తేయండి

–వారిని స్వస్థలాలకు పంపేయండి: సుప్రీం

న్యూఢిల్లీ,జూన్9(ఆర్ఎన్ఎ): వలస కూలీలను స్వంత రాష్ట్రాలకు 15 రోజుల్లోగా పంపించి వేయాలని సుప్రీంకోర్టు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తాజాగా మరోమారు ఆదేశాలు జారీ చేసింది. లాక్‌డౌన్ నిబంధనలను ఉల్లంఘించిన వలస కూలీలపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించకోవాలని కూడా అత్యున్నత న్యాయస్థానం పేర్కొన్నది. సరళీకరించిన పద్ధతిలో వలస కూలీల జాబితాను తయారు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోర్టు కోరింది. వలస కార్మికులకు కల్పిస్తున్న ఉపాధి అవకాశాల గురించి కూడా వెల్లడించాలని కోర్టు పేర్కొన్నది. ఒకవేళ ఏ రాష్ట్రానికైనా శ్రామిక్ రైళ్ల అవసరం ఉంటే, రైల్వేశాఖ ఆ రాష్ట్రానికి 24 గంటల్లో రైలును ఏర్పాటు చేయాలని కోర్టు పేర్కొన్నది. కూలీల కోసం తయారు చేసిన పథకాలు, ఉపాధి కల్పనలకు సంబంధించిన వివరాలతో కూడిన దరఖాస్తులను జూలై 8వ తేదీలోగా సమర్పించాలని, ఆ రోజున మళ్లీ ఈ కేసును విచారించనున్నట్లు సుప్రీం పేర్కొన్నది.

భారత్‌లో ఆందోళనకరంగా కరోనా

కొత్తగా 9,987 కొత్త కేసులు నమోదు

ఒక్కరోజే 331మంది మృతి

న్యూఢిల్లీ,జూన్9(ఆర్ఎన్ఎ): దేశంలో కరోనా ఉధృతి కొనసాగుతోంది. కరోనా కేసులు రోజురోజుకూ రికార్డు స్థాయిలో పెరిగిపోతున్నాయి. కేసుల సంఖ్యపరంగా మహారాష్ట్ర ఇప్పటికే చైనాను దాటేసింది.

గడచిన 24 గంటల్లో ఇదివరకెన్నడూ లేనంతగా కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. మంగళవారం కొత్తగా 9,987 కొత్త కేసులు వెలుగు చూశాయి. దీంతో దేశంలో మొత్తం బాధితుల సంఖ్య 2,66,598కు పెరిగింది. మహమ్మారి బారినపడి 24 గంటల్లో మరో 331మంది చనిపోయారు. దీంతో కరోనా వల్ల మృతిచెందిన వారి సంఖ్య 7,466కు చేరింది.

ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1,29,917 మంది కరోనా బాధితులు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకూ 1,29,215 మంది కోలుకున్నారు. ప్రతి రోజు దాదాపు 10 వేల కరోనా కేసులు నమోదవుతున్నాయి. గత 24 గంటల్లో అత్యధికంగా 9987 కరోనా కేసులు నమోదవ్వగా..331 మంది చనిపోయారు. దీంతో దేశంలో మొత్తం కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 2,66,598 కు చేరగా..7466 మంది చనిపోయారు. ఇందులో ఇప్పటి వరకు 1,29,215 మంది కరోనా నుంచి కోలుకున్నారు. ఇంకా 1,29,917 మంది చికిత్స తీసుకుంటున్నారు. అత్యధికంగా మహారాష్ట్రలో 88529 కరోనా కేసులు నమోదవ్వగా 3169 మంది చనిపోయారు. ఇక ప్రపంచ వ్యాప్తంగా కరోనా కేసుల్లో భారత్ 6వ స్థానంలో ఉంది.

ఎన్డీఆర్ఎఫ్‌లో 50 మంది సిబ్బంది కరోనా

జాతీయ విపత్తు ప్రతిస్పందన దళంలో 50 మంది సిబ్బంది కరోనా బారినపడ్డారు. పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాలలో ఎంఫాన్ తుఫాను అనంతర సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిలో 50 మంది కరోనా బారినపడినట్లు అధికారులు తెలిపారు. కటక్, భువనేశ్వర్ ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిలో 170 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 50 మందికి వైరస్ సంక్రమించినట్టు నిర్ధారణ అయింది. దీంతో చికిత్స కోసం వెంటనే వారిని ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారిని కటక్ సమీపంలోని ముందాలీ ఎన్డీఆర్ఎఫ్ క్యాంపస్ భవనంలో సెల్ఫ్ క్వారంటైన్ చేశారు. దేశంలో మరో 24 ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది కూడా కరోనా బారినపడినట్టు అధికారులు తెలిపారు. ఎన్డీఆర్ఎఫ్‌లో కరోనా కేసుల సంఖ్య పెరుగుతుండడంతో మొత్తం సిబ్బంది అందరికీ పరీక్షలు నిర్వహించాలని ఎన్డీఆర్ఎఫ్ నిర్ణయించింది.

ప్రపంచవ్యాప్తంగా 71,93,476కు చేరిన కరోనా కేసులు

4,08,614 మందికిపైగా బాధితులు మృత్యువాత

న్యూయార్క్,జూన్9(ఆర్ఎన్ఎ): ప్రపంచ వ్యాప్తంగా కరోనా ఉధృతి కొనసాగుతున్నది. ప్రాణాంతకమైన ఈ మహమ్మారి ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలకు విస్తరించడంతో పాజిటివ్ కేసులు, మరణాల సంఖ్య రోజ రోజుకు పెరుగుతూనే ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పటివరకు 71,93,476 మంది ఈ వైరస్ బారినపడ్డారు. ఇందులో 4,08,614 మందికిపైగా బాధితులు మరణించారు. చైనాలో జన్మించిన ఈ వైరస్ బారినపడినవారిలో 35,35,554 మంది కోలుకోగా, మరో 32,49,308 మంది చికిత్స పొందుతున్నారు. ఇక కరోనా కేసుల్లో అగ్రస్థానంలో ఉన్న అమెరికాలో గత 24 గంటల్లో 18,663 పాజిటివ్ కేసులు నమోద య్యాయి. దీంతో దేశంలో మొత్తం కరోనా కేసుల సంఖ్య 20,26,493కి పెరిగింది. అమెరికాలో ఇప్పటివరకు 1,13,055 మంది బాధితులు మరణించారు. మరో 7,73,480 మంది కోలుకోగా, 11,39,958 మంది చికిత్స పొందుతున్నారు. లాటిన్ అమెరికా దేశమైన బ్రెజిల్‌లో కరోనా వైరస్ విళయతాండవం చేస్తున్నది. దేశంలో కొత్తగా 18,925 కరోనా కేసులు నమోదయ్యాయి. దీంతో ఇప్పటివరకు కరోనా కేసుల సంఖ్య 7,10,887కి చేరింది. ఈ వైరస్ ప్రభావంతో 37,312 మంది మరణించారు. దేశవ్యాప్తంగా 3,47,973 యాక్టివ్ కేసులు ఉండగా, 3,25,602 మంది కోలుకుని డిశ్చార్జి అయ్యారు. మూడోస్థానంలో ఉన్న రష్యాలో కరోనా మరణాలు తక్కువగానే ఉన్నప్పటికీ, పాజిటివ్ కేసులు మాత్రం ప్రతి రోజు ఎనిమిది వేల పైచిలుకు నమోదవుతున్నాయి. దేశంలో గత 24 గంటల్లో 8,900 పాజిటివ్ కేసులు నమోదవడంతో, మొత్తం కరోనా కేసుల సంఖ్య 4,76,658కి పెరిగింది. రష్యాలో ఇప్పటివరకు 5971 మంది మరణించారు. నాలుగు, ఐదు స్థానాల్లో ఉన్న స్పెయిన్‌లో 2,88,797 పాజిటివ్ కేసులు నమోదవగా, యూకేలో 2,87,399 కరోనా కేసులు నమోదయ్యాయి. ఈ దేశాల్లో ఇప్పటివరకు 27,136 మంది, 40597 మంది ఈ వైరస్ కారణంగా మృతిచెందారు. గత ఆరు రోజులుగా 9 వేల పైచిలుకు పాజిటివ్ కేసులు నమోదవుతుండటంతో, ప్రపంచంలో అత్యధిక కేసులు రికార్డవుతున్న దేశాల జాబితాలో భారత్ ఆరో స్థానంలో కొనసాగుతున్నది. దేశంలో ఇప్పటివరకు 2,65,928 పాజిటివ్ కేసులు నమోదవగా, 7473 మంది మరణించారు.

రాజ్యసభకు నామినేషన్ వేసిన మాజీ ప్రధాని

హైదరాబాద్,జూన్ 9: మాజీ ప్రధాని దేవగౌడ ఇవాళ బెంగుళూరులో రాజ్యసభ కోసం నామినేషన్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, తన పార్టీకి చెందిన ప్రజా ప్రతినిధులు ఎన్నికల్లో పోటీచేయాలని కోరడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

దేశవ్యాప్తంగా 18 రాజ్యసభ స్థానాలకు జూన్ 19న ఎన్నికలు జరగనున్నాయి. గుజరాత్‌లో నాలుగు, ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు స్థానాలు, రాజస్థాన్ మూడు, మధ్యప్రదేశ్‌లో మూడు స్థానాలు, జార్ఖండ్‌లో రెండు, మణిపూర్, మేఘాలయలో ఒక్కో స్థానం చొప్పున ఉన్నాయి. షెడ్యూల్ ప్రకారం మార్చి 26న ఎన్నికలు జరగాల్సి ఉన్నప్పటికీ దేశంలో కరోనా నేపథ్యంలో లాక్‌డౌన్ విధించడంతో ఎన్నికలు వాయిదాపడ్డాయి. అయితే తాజాగా లాక్‌డౌన్‌ను సడలించడంతో రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషన్ కొత్త తేదీలను ప్రకటించింది.

మరణించినవారందరకీ పరీక్షలు సాధ్యం కావు

–స్పష్టం చేసిన మంత్రి ఈటెల రాజేందర్

హైదరాబాద్,జూన్9(ఆర్ఎన్ఎ): మృతి చెందిన వారికి కొవిడ్ పరీక్షలు చేయాలనడం అశాస్త్రీయమైనదని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. మృతులందరికీ కరోనా పరీక్షలు చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. కరోనా బారిన పడినవారికి గాంధీ ఆస్పత్రిలో మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు చెప్పారు. కరోనా సోకిన వారందరినీ బతికించేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తున్నామన్నారు.

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో వైద్యులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా వైద్య సేవలు అందిస్తున్నారని కొనియాడారు.

చనిపోయిన వారికి కొవిడ్ పరీక్షలు చేయాలనడం అవగాహన రాహిత్యంతో కూడుకున్నది. ఐసీఎంఆర్ నిబంధనల్లో ఎక్కడ కూడా భౌతికకాయానికి పరీక్షలు నిర్వహించాలని చెప్పలేదు. రాష్ట్రంలో నిత్యం వెయ్యిమంది మరణిస్తున్నారు. దేశంలో నిత్యం 30వేల మంది చనిపోతున్నారు. వారందరికీ టెస్టులు చేయడం సాధ్యం కాదని ఈటల స్పష్టం చేశారు.

చరిత్రలో నేటినిజం

కలా సుమ కోమల హృదయుండై
కమ నీయముగానడచె డి కవితల నుడువన
విమలగుణుండని దలచెద
నమలాత్ముని బసవరాజు అప్పారావున్!!

(జూన్ 10 బసవరాజు అప్పారావు జయంతి..)

–రాధశ్రీ

సెల్: 9494481210

ప్రస్తుత మన దేశ పరిస్థితి ఏంటి?

నేటినిజం
బుధవారం 10-6-2020

మూడవ ప్రపంచ యుద్ధంలో ఆర్థిక రంగం కీలకపాత్ర పోషిస్తున్నది. ఇటు కమ్యూనిస్టుదేశాలు అటు బూర్జువా దేశాలు తృతీయ ప్రపంచ దేశాలను ఆర్థికంగా వంచిస్తాయి. హింసిస్తాయి. అప్పులు ఇచ్చి చక్రవడ్డీలు కట్టి చిన్నచిన్న దేశాలను తమ గుప్పిట్లోకి తెచ్చుకుంటాయి. దక్షిణ ఆసియాలో భారత్ బలమైనశక్తిగా ఎదగకుండా ఉండే నిమిత్తం అమెరికా అధ్యక్షులు నిక్సన్ లాంటివాళ్లు పాకిస్తాన్ అనే విషకన్యను ప్రయోగించారు. ఇక చైనా ఊహాన్ ప్రావిన్స్‌నుండి ఊహాతీతంగా ఒక మహమ్మారిని సృష్టించి 2020లో ప్రపంచం మీదికి వదిలింది. ఈ జనసైడ్ బాధ్యత నుండి జిన్‌పింగ్ తప్పించుకొనజాలడు. ఇటలీ రోమన్ కేథలిక్ దేశం. అది వాటికన్ పోపు సామ్రాజ్యంలో అంతర్భాగమే. చైనా, ఇరాన్, ఇటలీలలో కరోనావైరస్ (కోవిడ్-19) మృతుల సంఖ్య అధికంగా ఉంది ఎందువలన? 'ప్రార్థనలు చేయుడీ'! మీ రోగములు నయమగును' అనే ఫ్రాంకోముల్లక్కర్ టి. సతీశ్‌కుమార్, విజయకుమార్‌లు ఈ కరోనా వైరస్ స్పైన్‌ఫ్లూను ఎయిడ్స్‌లను ఎందుకు ఎదుర్కోలేకపోయారు?

గొడ్డుమాంసం తినే యూరప్‌లోను, గబ్బిలాలు, పాములు తినే చైనాలోను ఈ వైరస్ విస్తృతంగా వ్యాపించింది. సౌదీ అరేబియాలో స్నానం చేయరు. అందుకు నీటి కొరత కారణం కావచ్చు. అపరిశుభ్రమైన నీచు తింటారు. ఒక మనిషిని తృప్తిపరచడానికి ఒక భార్య చాలు. పది మంది ఎందుకు? పాత నిబంధనలో సాలమన్‌కు వెయ్యిమంది భార్యలున్నట్లు 'రాజులు' అదే ప్రకరణంలో వ్రాయబడి ఉంది. ఇందులో సాలమన్ అంటే సోలార్‌మన్. మరి ఉస్మాన్ ఆలీఖాన్ జనానాలో వందలాది స్త్రీలు ఎలా ఉన్నారు? ఇవన్నీ విలాసాలు కావు. విధ్వంస హేతువులు. ఎయిడ్స్ వంటి వ్యాధులు ఇలాగే వ్యాపిస్తాయి. కరోనా వైరస్ వలన స్కూళ్లు, సినిమాహాళు్ల, పర్యాటక రంగాలు మూతపడ్డాయి. వాటికన్, తిరుపతి, మక్కాలు వెలవెలబోతు న్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే లక్షల బిలియన్‌ల ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయింది. ఇండియాలో పది రూపాయల నోటు తన కొనుగోలు శక్తిని కోల్పోయింది. 'పుకార్లు వ్యాప్తి చేయకండి', 'ప్రజలను భయపెట్టకండి' అంటున్నారు. హైదరాబాదు క్వరంటీన్ నల్లకుంట, గాంధీ(ముషీరాబాదు)లలో వైరస్ వ్యాధి పీడితులు ముఖ్యంగా సౌదీనుండి వచ్చినవారు ఉండటం నిజం కాదా? ఇందులో వదంతులేము న్నాయి? చైనా చేసిన పాపం మానవాళికి శాపంగా మారింది. చైనావద్ద అణ్వస్త్ర, జలాంతర్గాములూ, ఇంటర్ కాంటినెంటల్ బాలిస్టిక్ మిస్సైల్స్ ఉన్నాయి. అవి ఇవ్వాళ తమ దేశ ప్రజలను రక్షించగలవా? చెప్పండి! డొనాల్డ్ ట్రంప్ అమెరికాలో ఆరోగ్య అత్యవసర పరిస్థితిని విధించాడు. ఇండియా కూడా అంతే. ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్‌లో ప్రస్తుతం 12వేల మరణాలు, లక్ష ఇరవై వేల కరోనా కేసులు నమోదు అయినాయి. ఆరోగ్య నియమాలు పాటించకుండా నమాజు పేరు తో మసీ దులకుపోతే ఈ సంఖ్య పెరిగి లక్షల మరణాలు చూడవలసి వస్తుందని టీవీలో యాంకర్ ప్రకటించింది. "చైనావైరస్" ఇరాన్ ఇటలీలను కబళిస్తున్నది. ఎందువలన? ఎవరు ఔనన్నా కాదన్నా ఒకటి మాత్రం నిజం. హల్లెలూయా పాటలు ఇటలీని కాపాడలేక పోయాయి. అల్లాహూ అక్బర్ నినాదాలు ఇరాన్‌ను రక్షించలేవు. బాబాలు చీచీలు ముంబయిని చైనా వైరస్‌నుండి ఎందుకు బతికించలేకపోతున్నారు? సూటిగా జవాబు చెప్పండి. ఇవన్నీ తెలిసే భారతీయులు పూర్వం ప్రతిరోజూ ఇంట్లో యజ్ఞం చేసే వారు. ఎవరి ఇంట్లో యజ్ఞం జరుగుతుందో అక్కడికి సూక్ష్మజీవులు అంటువ్యాధులు రావు. ఇటీవల కాలంలో యజ్ఞాలను, యాగాలను విపరీతంగా విమర్శించేవారికి ఇప్పటికైనా అర్థమైతే బావుంటుంది.

లద్దాఖ్‌లో చైనా ఏం చేస్తోంది?

-మరోమారు రాహుల్ అనుమానాలు

న్యూఢిల్లీ,జూన్9(ఆర్ఎన్ఎ): కొన్నాళ్ల నుంచి సరిహద్దు విషయంలో చైనాతో పేచీ జరుగుతున్న క్రమంలో ఆదివారం రాహుల్ చేసిన ట్వీట్ కొత్త వాగ్వాదానికి దారి తీసింది. లడాఖ్‌లో ఏం జరుగుతుందో ప్రతి భారతీయ సైనికుడికి తెలుసు అని, వారి రక్తం మరుగుతోందని, కానీ మీడియా నోరును కూడా నొక్కేశారని రాహుల్ వివాదాస్పద ట్వీట్ చేశారు. దానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కౌంటర్‌గా ఓ ట్వీట్ చేశారు. ఓ కవితను ట్వీట్ చేస్తూ రాహుల్‌కు రాజ్‌నాథ్ సమాధానం ఇచ్చారు. అయితే తాజాగా ఆ ట్వీట్‌ను ప్రశ్నిస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ మరో అనుమానాన్ని లేవనెత్తారు. రక్షణ మంత్రి ట్వీట్‌తో ఓ విషయం బయట పడిందని, దానికి ఆయన సమాధానం ఇవ్వగలరా అని రాహుల్ అడిగారు. లడాఖ్‌లో ఉన్న భారత భూభాగాన్ని చైనా ఆక్రమించిందా అని రాహుల్ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.సోమవారం ఓ ర్యాలీలో పాల్గొన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. భారత రక్షణ వ్యవస్థకు ప్రపంచదేశాల గుర్తింపు ఉన్నదని, తమ సరిహద్దుల్ని రక్షించుకోవడంలో అమెరికా, ఇజ్రాయిల్ తర్వాత స్థానం భారత్‌దే అని షా అన్నారు. ఆ వ్యాఖ్యలను తప్పుపడుతూ రాహుల్ తొలుత విమర్శలు చేశారు. దానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ఓ కౌంటర్ ఇచ్చారు. చేతికి నొప్పి ఉంటే మందు రాయాలని, కానీ చేయి సరిగా లేకుంటే, అప్పుడు ఏం చేస్తామని రాజ్‌నాథ్ తన ట్వీట్‌తో కాంగ్రెస్ పార్టీని అటాక్ చేశారు.

రైతు వేదిక భవన నిర్మాణ పనులు తక్షణమే చేపట్టాలి

ఖమ్మం, జూన్ 9 : రైతు వేదిక భవన నిర్మాణ పనులు తక్షణమే చేపట్టాలని అధికారులకు రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆదేశించారు. జిల్లాలోని రఘునాథపాలెం మండల కేంద్రం లో నిర్మించే రైతు వేదిక భవన నిర్మాణ పనులను మంత్రి పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి అజయ్ కుమార్ సొంత ఖర్చులతో జింకలతండా క్రాస్ రోడ్డులో నిర్మించే రైతు వేదిక భవనం స్థలాన్ని సైతం పరిశీలించారు. ఈ నెల 2వ తేదీన ఇక్కడ నిర్మించే రైతు వేదిక భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. అలాగే పలు అభివృద్ధి పనులపై వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. రైతు వేదిక భవనం జిల్లాకే ఆదర్శం కావాలన్నారు.

వలస కూలీలను అవమానించిన మమతా

-వర్చువల్ ర్యాలీలో మండిపడ్డ అమిత్ షా

న్యూఢిల్లీ,జూన్9(ఆర్ఎన్ఎ): వలస కూలీలను తరలించే శ్రామిక్ రైళ్లను కరోనా ఎక్స్‌ప్రెస్ అని పేరు పెట్టిన దీదీపై అమిత్ షా ఫైర్ అయ్యారు. కరోనా ఎక్స్‌ప్రెస్ రైళ్లే మీ రాజకీయ జీవితానికి చరమగీతం పాడ నున్నట్లు షా హెచ్చరించారు. ఎంతో ఇబ్బందుల్లో ఉన్న వలస కూలీలను మమతా బెనర్జీ కించపరిచిం దన్నారు. వచ్చే ఏడాది పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బీజేపీ నేత అమిత్ షా ప్రచారం మొదలుపెట్టారు. ఆయన వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జన్ సంవాద్ ర్యాలీలో ప్రసంగించారు. బెంగాల్ సీఎం మమతా బెనర్జీపై షా తీవ్ర విమర్శలు చేశారు.శ్రామిక్ రైళ్లను నడుపుతూ వైరస్ వ్యాప్తికి కేంద్ర ప్రభుత్వం కారణమైందని మమతా ఇటీవల ఆరోపించారు. వర్చువల్ సభలో బీజేపీ వర్కర్లతో మాట్లాడిన అమిత్ షా.. పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకించిన మమతా బెనర్జీ భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందన్నారు. బెంగాల్ ప్రజలే మమతా బెనర్జీని రాజకీయ శరణార్థిగా మారుస్తారని ఆయన విమర్శించారు. లాలూచీ రాజకీయాలను అంతం చేసేందుకు సీఏఏ సమర్థవంతమైనదని, బెంగాల్ ప్రజలు దీని గురించి తెలుసుకోవాలన్నారు. దశాబ్దాలుగా శరణార్థులకు జరుగుతున్న అన్యాయాన్ని ఆ చట్టం అడ్డుకుంటుందని షా అన్నారు. దేశవ్యాప్తంగా అంతటా ప్రజాస్వామ్యం వెల్లువిరుస్తుంటే, ఒక్క బెంగాల్‌లో మాత్రమే రాజకీయ హింస తారాస్థాయికి చేరిందన్నారు. హింస రాజకీయాలను బెంగాల్ సీఎం ప్రోత్సహిస్తున్నట్లు షా ఆరోపించారు.

తక్షణమే రైతువేదిక నిర్మాణం పూర్తి

అధికారులకు మంత్రి పువ్వాడ ఆదేశం

పారిశుద్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచన

ఖమ్మం,జూన్9(ఆర్ఎన్ఎ): రైతు వేదిక భవన నిర్మాణ పనులు తక్షణమే చేపట్టాలని అధికారులకు రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆదేశించారు. జిల్లాలోని రఘునాథపాలెం మండల కేంద్రంలో నిర్మించే రైతు వేదిక భవన నిర్మాణ పనులను మంత్రి పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి అజయ్ కుమార్ సొంత ఖర్చులతో జింకలతండా క్రాస్ రోడ్డులో నిర్మించే రైతు వేదిక భవనం స్థలాన్ని సైతం పరిశీలించారు. ఈ నెల 2వ తేదీన ఇక్కడ నిర్మించే రైతు వేదిక భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. అలాగే పలు అభివృద్ధి పనులపై వ్యవసాయ, రెవెన్యూ అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. రైతు వేదిక భవనం జిల్లాకే ఆదర్శం కావాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధికి వివిధ కార్యక్రమాలు చేపడుతున్న సిఎం కెసిఆర్ రైతులకు అనేక విధాలుగా సాయం చేస్తున్నారని అన్నారు. అంటువ్యాధుల నివారణ చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పరిశుభ్రతకు మొదటి ప్రాధాన్యం ఇస్తుందని పేర్కొన్నారు. జిల్లాలోని ఖమ్మం నగరంతో పాటు మున్సిపాలిటీల్లో కూడా మురికి కాలువల్ని శుభ్రం చేసి మురుగు నీరు, వర్షపునీటి ప్రవాహాలకు ఆటంకం తలెత్తకుండా చూడాలన్నారు. అదే విధంగా రోడ్ల వెంబడి ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించాలని సూచించారు. యాంటీ లార్వా కార్యక్రమాలను ముమ్మరంగా చేపట్టి వర్షాకాల సీజన్‌లో అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇంటితో పాటు ఇంటి పరిసరాలు ప్రభుత్వ ఆసుపత్రులు, బస్‌స్టేషన్లు, మార్కెట్లు, పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.

దుబారా పథకాలతో దానకర్ణులు కాగలరా?

హైదరాబాద్,జూన్ 9:ప్రజలపై పన్నుల భారం మోపడం ద్వారా వచ్చే ఆదాయంతో సంక్షేమం పేరిట దుబారా పథకాలు కొనసాగించాలా అన్నది ప్రభుత్వాలు ఆలోచించాలి. లాక్‌డౌన్ కారణంగా విద్యుత్ బిల్లులు ఇరు తెలుగు రాష్ట్రాల్లో ప్రజలపై మోయలేని భారం మోపాయి. అసలే ఆదాయం లేకుండా ఇంటికే పరిమితం అయిన ప్రజలపై విద్యుత్ బిల్లుల భారం తీవ్రంగా పడింది. దీనిపై తెలంగాణ విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, ఇతర అధికారుల ప్రకటన చూస్తే ఆగ్రహం కలిగించేలా ఉంది. అలాగే ఎపిలోనూ విద్యుత్ బిల్లుల మోతపై విపక్షాలు నెత్తీనోరు మొత్తుకుంటున్నా పట్టించుకోవడం లేదు. ప్రజలకు డబ్బులను పెంకానుల్లా పంచుతున్న నేతలు ఓ వైపు భారం మోపుతూ..వాటి ద్వారా వచ్చే మొత్తాలను పందేరం చేస్తూ వ్యక్తిగత ప్రయోజనాలు పొందుతున్నారు. తామంతా దానకర్ణుల్లాగా..చేతికి ఎముక లేదన్న తీరుగా పథకాల పేరుతో ప్రజల డబ్బుల ను పంచుతూ దుబారా చేస్తున్నారు. ఖజానాను ఖాలీ చేస్తున్నారు. ఇలాంటి పథకాల వల్ల ప్రజలను సోమరులుగా చేయడం తప్ప మరోటి కాదు. విద్యుత్ బిల్లులను తగ్గించడం లేదా రద్దు చేయడం మాత్రం చేయడం లేదు. అలాగే ఇంటిపన్నులను రద్దు చేయడం లేదు. విపరీతంగా పన్నుల భారం మోపుతూతెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వాలు తమ నచ్చిన పథకాలను అమలు చేస్తున్నారు. ఉదాహరణకు ఇరు తెలుగు రాష్ట్రాల్లో అందచేస్తున్న కిలో రూపాయి బియ్యం పథకం పక్కదారి పడుతున్నా పట్టించుకోవడం లేదు. సరికదా ఇంకా సన్నబియంయం సరఫారా చేస్తామని, అందమైన ప్యాకుల్లో సరఫరా చేస్తామని ప్రకటించారు. నిజానికి రూపాయికి ఏ వస్తువుకూడా రావడం లేదు. చాక్లెట్ లేదా పిప్పరమెంట్ కూడా రాదు. అయినా దీనిపై కోట్లాది రూపాయలను దుబారా చేయడం వెనక ఓటు రాజకీయాలు తప్ప మరోటి కానరావు. కరోనాతో ప్రజల జీవితాలు అతలాకతలం అయితే..ఏ విధంగా ఆదుకోవాలో ఆలోచన చేయాల్సిన తరుణం ఇది. ఎపిలో ఇప్పుడు సన్నబియ్యం ప్యాకెట్లలో సరఫరాకు శ్రీకారం చుట్టడంతో ఇక ఇదో వ్యాపార పథకంగా మారనుంది. రూపాయికి కొత్తిమీర కూడా లభించని ఈ రోజుల్లో ఇంకా ఈ పథకాన్నికొనసాగించడం ఆర్థిక భారం తప్ప మరోటి కాదు. ఆర్థిక మందగమనం నేపథ్యంలో అనేక పథకాలను సమీక్షించాల్సిన అవసరం ఉంది. అధికారం ఉందికదా అని ఖజానాను ఇష్టం వచ్చినట్లు పంచుతూ పోవడం ఎంతవరకు సమంజసమో ఆలోచన చేయాలి. తాము చేస్తున్న ఖర్చు.. తమ సొంత సంపాదన కాదని పాలకులు గుర్తించాలి. అలాగే ప్రజలు చెమటోడ్చి కట్టిన పన్నుల డబ్బులను దుబారా చేయడం కూడా సరికాదు. ప్రజలను స్వశక్తిమీద నిలబడేలా చేసే పథకాలను అమలు చేయాలి. వారు సొంతంగా కాళ్లపై నిలబడి సంపాదించుకునే పథకాలు చేపట్టాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడేలా చర్యలు తీసుకోవాలి. నిరుపేదలకు ఉచిత పథకాలపై సమీక్షించకుంటే తెలుగు రాష్ట్రాల్లో ఆర్థికమాంద్యం కూడా తీవ్ర ప్రభావం చూపగలదని తాజాగా కరోనా ద్వారా ఏర్పడ్డ పరిస్థితులు సూచిస్తున్నాయి. ప్రజలు చెమటోడ్చి పన్నుల రూపంలో కట్టిన డబ్బులు వృధా పథకాలతో దుబారా చేస్తున్న పథకాలకు చరమగీతం పలకాకలి. ప్రజల డబ్బులకు జవాబుదారీగా ఉండాల్సిన పాలకులు తమకు అనుగుణంగా, ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం పథకాలను కొనసాగించడం సరికాదు. బియ్యం పథకంపై ఆజమాయిషీ లేకపోవడం వల్ల చౌక బియ్యాన్ని తినడానికన్నా అమ్ముకోవడానికే ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఇది కొందరికి ఆదాయవనరుగా మారింది. ఈ బియ్యంతో హోటళ్లలో టిఫిన్లు తయారవుతున్నాయి. అలాగే సరిహద్దులు దాటి సన్నబియ్యంగా మారుతున్నాయి. పాలకుల దూరాలోచన లేని కారణంగా ఈ బియ్యం పథకం కేవలం వ్యాపార దృక్పథంతో సాగుతున్నాయి. తాజాగా ఎపిలో ప్యాకింగ్ కవర్లలో ఇవ్వడం వల్ల మరింత ఖర్చుతో కూడుకున్నదిగా మారనుంది.

ఇందుకోసం ప్రత్యేకంగా జూట్ సంచులను కూడా తయారు చేశారు. సన్నబియ్యం రూపాయికే వస్తాయా అన్నది ఆలోచించాలి. వాటిని ప్యాక్ చేయడానికి మోరో రెండు రూపాయల వరకు ఖర్చు కాగలదు. నిరుపేదల కడుపు నింపడానికి పంపిణీ చేయాల్సిన రాయితీ బియ్యం యథేచ్ఛగా నల్ల బజారుకు తరలి అక్రమార్కుల పరం అవుతోంది. సిబ్బంది కొరత, కొరవడిన తనిఖీలకు ప్రజల అమాయకత్వం జత కలవడంతో ప్రజా పంపిణీ వ్యవస్థ గాడి తప్పింది. బియ్యం అక్రమ రవాణా చేయడం నిత్యకృత్యంగా మారినా అరికట్టాల్సిన అధికారులు చేష్టలుడిగి ప్రేక్షక పాత్రకు పరిమితమవుతున్నారు. రేషన్ దుకాణాల సమయపాలనకు తిలోదకాలు ఇవ్వడం, నిత్యావసర సరకులు వచ్చినా రాలేదని గద్దించడం, కార్డులను డీలర్లు తమ వద్దే ఉంచుకొని బియ్యాన్ని స్వాహా చేస్తూ రాష్ట్రాలను దాటిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆనాటి ముఖ్యంత్రి ఎన్టీఆర్ బడుగు బలహీన వర్గాలకు బియ్యం అందచేయాలన్న లక్ష్యంతో కిలో రెండు రూపాయల బియ్యం పథకాన్ని అమలు చేశారు. ఆనాడది సంచలన నిర్ణయంగా నిలిచింది. ఆనాటి అసవరం కూడా అది. కానీ తరవాత ఎందుకీ పథకం అన్న ఆలోచన చేయడం లేదు. అలాగే ఇబ్బడిముబ్బడిగా డబ్బులను పంచే పథకాలు పెంచుతూ పోతున్న వారు కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకునేందుకు విద్యుత్ బిల్లులను తగ్గించడమో లేదా రద్దు చేయడమో చేయాలి. ఇంటిపన్నులను రద్దు చేయాలి. ప్రభుత్వ పరంగా ఏ మేరకు సాయం చేయగలమో ఆలోచన చేయాలి. పేద,మధ్యతరగతి ప్రజలు మళ్లీ తమ బతుకులు గాడినపడేలా చేయాలి. అవసరమైన చేయూతను అందించాలి. అంతేకానీ అత్తసొమ్ము అల్లుడు దానం చేసినట్లు ప్రజల కష్టార్జితాన్ఇన పందేరం చేస్తూ తాము దాన కర్ణులం అన్న ప్రచారం మానుకోవాలి. ప్రజలను పన్నులు భారంతో పీడించే బదులు ఉచిత పథకాలను పక్కన పెట్టాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేదిగా, ప్రజలు ఉపాధి పొందే పథకాలను ప్రోత్సహించాలి. అప్పుడే పాలకుల సత్తా బయటపడగలదు.

లాక్‌డౌన్‌తో ఆగినా మళ్లీ రవాణాకు సిద్ధం

రూపాయి బియ్యం కోసం కాచుకుకూర్చున్న దళారీలు

నిజామాబాద్,జూన్9(ఆర్ఎన్ఎ): తెలంగాణ జిల్లాలకు మహారాష్ట్ర అతి సమీపంలో ఉండటం, అక్కడ బియ్యం ధర అధికంగా ఉండటంతో పేదల ఆకలి తీర్చాల్సిన రాయితీ బియ్యాన్ని అక్రమార్కులు ఇంతకాలం సొమ్ము చేసుకుంటూ వచ్చారు. లాక్‌డౌన్‌తో రవాణా ఆగినా మళ్లీ తిరిగి పుంజుకోవడం ఖాయమని స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే రోడ్డుసైడ్ ఫలాహార బండ్లకు కూడా ఈ బియ్యం సరఫరా అవుతున్నాయని, ఇవి బాహాటంగా జరిగే వ్యాపారమని అంటున్నారు. రాయితీ బియ్యం అక్రమ రవాణాను కొందరు వృత్తిగా మార్చుకున్నారు. రైళ్లలో అక్రమ రవాణా జరుగుతున్నా, బియ్యాన్ని పోలీసులు పట్టుకోవడం నిత్యం జరుగుతున్నా అవకతవకలకు అడ్డుకట్ట పడలేదు. దీనిపై సమీక్షించి కఠినంగా వ్యవహరించడంతో పాటు కిలో రూపాయిని కనీసం ఐదు రూపాయలకు పెంచాల్సిన అవసరం ఉంది. ఈ మొత్తాన్ని రైతులకు మద్దతు ధరలకు కేటాయిస్తే మరీ మంచిది. వేలకోట్లు దండగమారి పథకానికి ఖర్చు చేస్తున్నారు. ఎపి విడిపోయిన తరవాత కూడా ఇంకా ఈ పథకాన్ని అమలు చేయడం ద్వారా వేలకోట్లు వృధా అవుతున్నాయి. ఎన్టీఆర్ తరవాత చంద్రబాబు సిఎం అయ్యాక దానిని ఐదు రూపాయలకు పెంచారు. దీంతో కొంత దుబారా తగ్గిందనే చెప్పాలి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిక మళ్లీ కిలో రెండు రూపాయలకు చేశారు. ఇలా చేయడం వల్ల కేవలం ఓటు బ్యాంక్ రాజకీయాలు దాగి ఉన్నాయి. దీనిని కిరణ్ కుమార్ రెడ్డి సర్కార్ కిలో రూపాయికే మార్చడం ద్వారా అక్రమాలకు తెరలేపారు. కిలో రూపాయికి బియ్యం ఇవ్వడం వల్ల వ్యాపారులకు లాభాలు చేకూర్చే పథకంగా మారింది. వేలకోట్లు ఈ పథకం కోసం ఖర్చవుతున్నా మళ్లీ సమీక్ష చేయలేక పోతున్నారు. ఎక్కడ ఓట్లు పోతాయో అన్న అభయం నాయకులను వెన్నాడుతున్నట్లుగా ఉంది. రేషన్ కార్డులు తగ్గించడమంటే పేదవారికి బియ్యం అందకుండా అడ్డుకోవడం కాదు. రేషన్ బియ్యం తినే ప్రతిఒక్కరికీ బియ్యం అందిస్తాం అంటూ ప్రజలు కట్టే పన్నులకు పాతరేస్తున్నారు. చౌకధరలకు తీసుకుని బయట అమ్ముకునే వారిని గుర్తించి తొలగించడం లేదు. కార్డులు తగ్గించడం కన్నా అక్రమాలపై దృష్టి పెట్టడం లేదు. పేదలకు బియ్యం అందించాలన్న సదుద్దేశ్యాన్ని ఎవరూ కాదనలేరు. కానీ రూపాయికే ఇవ్వాలనుకోవడం, అలా ఇచ్చిన బియ్యం అక్రమంగా తరలకుండా కఠినంగా చర్య తీసుకోకపోవడమే ఆక్షేపణీయం. ఇకపోతే డీలర్ల మాయాజాలం కూడా దీనికి తోడవుతోంది. మారుమూల గ్రామాల్లో నేటికీ ఇదే తంతు కొనసాగుతోంది. ఈ పాన్ పెట్టినా ఫలితం లేదనడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. మూడు పూటలా తిండికి నోచుకోని నిరుపేదలు కిలోమీటర్ల దూరంలోని రేషన్ దుకాణాల్లో సరకులు తీసుకోవడానికి ఆర్థిక భారమైనా రవాణా ఛార్జీలు భరిస్తూ, నానాపాట్లు పడుతున్నా మారుమూల, గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు నేరుగా బియ్యం పంపిణీ చేస్తే ఎలాంటి ఆక్షేపణా ఉండదు.

ప్రపంచవ్యాప్తంగా తీవ్రమవుతున్న కరోనా

అమెరికా,దక్షిణాసియా దేశాల్లోనే 75 శాతం కేసులు

ఇప్పటి వరకు 70 లక్షల పాజిటివ్ కేసులు నమోదు

తీవ్రనిర్లక్ష్యమే కారణమన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ

జెనీవా,జూన్9(ఆర్ఎన్ఎ): ప్రపంచవ్యాప్తంగా కరోనా కేసులు తీవ్రమవుతున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ అధ్యక్షుడు టెడ్రోస్ అధనామ్ హెచ్చరించారు. ఆదివారం ఒక్కరోజే ప్రపంచంలో 1,36,000 కరోనా కేసులు పెరిగినట్లు వెల్లడించారు. ఇందులో అమెరికా, దక్షిణాసియాలోని పది దేశాల్లోనే 75 శాతం కేసులు ఉన్నాయని చెప్పారు. గత తొమ్మిది రోజుల్లో లక్ష మందికి వైరస్ సోకినట్లు తెలిపారు. ఒక్క రోజులో ఇన్ని పాజిటివ్ కేసులు నమోదవడం ఇదే మొదటిసారని పేర్కొన్నారు. ఈ ప్రాణాంతక వైరస్ ఇప్పటివరకు 4,03,000 మందిని పొట్టనపెట్టుకుందని, 70 లక్షల పాజిటివ్ కేసులు నమోదయ్యాయని చెప్పారు. చైనా తర్వాత తూర్పు ఆసియా కరోనాకు కేంద్రంగా మారిందని, అనంతరం అది యూరప్ ఖండానికి విస్తరించిందని తెలిపారు. ప్రస్తుతం కరోనాకు ప్రధాన కేంద్రంగా ఉన్న అమెరికా వాటిని అధిగమించిందని తెలిపారు. అమెరికాలో జరుగుతున్న జాతివ్యతిరేక ఆందోళనలతో వైరస్ మరింతగా వ్యాప్తిచెందే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. కొన్ని దేశాల్లో వైరస్ వ్యాప్తి తక్కువగా ఉన్నదని, మరికొన్ని దేశాల్లో కేసుల సంఖ్య వెయ్యిలోపే ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాల్లో సానుకూల పరిస్థితులు ఉన్నాయని, అయితే నిర్లక్ష్యమే వారికి ముప్పుగా మారే అవకాశం ఉందన్నారు. ఐరోపాలో పరిస్థితి మెరుగు పడుతున్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా ఇది మరింత దిగజారుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రపంచ వ్యాప్తంగా కరోనా వైరస్ విస్తరిస్తున్న తీరుపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పరిస్థితి మరింత దిగజారుతోందని హెచ్చరించింది. ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ పాజిటివ్ కేసులు70 లక్షలను మించడంతో ఆందోళన వ్యక్తం చేసిన సంస్థ ఈ వ్యాఖ్యలు చేసింది. ఐరోపాలో పరిస్థితి మెరుగుపడుతున్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ మహమ్మారి తీవ్రతరం అవుతోందని సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అధనామ్ హెచ్చరించారు. అమెరికా, దక్షిణ ఆసియాలోని 10 దేశాలనుంచి 75శాతం కేసులు నమోదయ్యాయంటూ విలేకరుల సమావేశంలో టెడ్రోస్ ఆందోళన వ్యక్తం చేశారు. గత 10 రోజులలో తొమ్మిది రోజుల కాలంలో లక్షకు పైగా కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. ఆఫ్రికాలో చాలా దేశాలలో 1,000 కంటే తక్కువ కేసులు ఉన్నప్పటికీ, చాలా దేశాల్లో కొత్త ప్రాంతాల్లో విస్తరణ సహా కేసుల పెరుగుదల నమోదవుతోందని టెడ్రోస్ చెప్పారు. అదే సమయంలో ప్రపంచంలోని అనేక దేశాల్లో సానుకూల సంకేతాలు కనిపిస్తున్నాయని టెడ్రోస్ చెప్పారు. అయితే ఈ దేశాలలో అతిపెద్ద ముప్పు నిర్లక్ష్యమేనని టెడ్రోస్ పేర్కొన్నారు. కాగా ప్రపంచవ్యాప్తంగా కరోనా ఉధృతి కొనసాగుతూనే వుంది.

ఆర్టీసీ బస్సులు నడిస్తేనే చెక్ పోస్టు ఎత్తేసే అవకాశం?

ఏపిలోకి వెళ్ళే వాహనాలపై కొనసాగుతున్న ఆంక్షలు

నల్లగొండ,జూన్9(ఆర్ఎన్ఎ): ఇరు రాష్ట్రాల మధ్య ఆర్టీసీ బస్సులు నడిపేందుకు ప్రభుత్వం ఒకటి, రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోనుంది. ఇప్పటికే హైదరాబాద్ నుంచి రామాపురం క్రాస్‌రోడ్డు చెక్‌పోస్టు వరకు ఆర్టీసీ బస్సులు నడుస్తుండగా, అటు విజయవాడ నుంచి గరికపాడు వరకు ఏపీ ప్రభుత్వం బస్సులు నడుపుతోంది. కరోనా వైరస్ నియంత్రణ కోసం రెండు నెలల కిందట రాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టులను అధికారులు ఎత్తివేశారు. అయితే ఎపికి వెళ్లే వాహనాలపై ఆంక్షలు మాత్రం కొనసాగి స్తున్నారు. ప్రస్తుతం ఏపీ నుంచి అన్ని రకాల వాహనాలను రాష్ట్రంలోకి వస్తుండగా, ఏపీ ప్రభుత్వం మాత్రం అనుమతి ఉన్న వాహనాలకే ఓకే చెబుతోంది. మిగతా వాహనాలపై ఆంక్షలు కొనసాగుతున్నాయి. దీంతో తెలంగాణ వైపు నుంచి గూడ్స్, నిత్యవసరాలు, ఫార్మసీ రంగాని కి సంబంధించి వాహనాలను మాత్రమే ఏపీలోకి వెళ్తున్నాయి. దీంతో రాష్ట్రంలోకి రాకపోకలు సజావుగా సాగుతున్నాయి. ఇప్పటికే నల్లగొండ జిల్లా దామరచర్ల మండలంలోని వాడపల్లి, నాగార్జునసాగర్, సూర్యాపేట జిల్లా కోదాడ మండలం నల్లబండగూడెం సమీపంలోని రామాపురం క్రాస్ రోడ్డు చెక్‌పోస్టులను ఎత్తివేశారు. అయితే రామాపురం వద్ద ఏపీ చెక్‌పోస్టును మాత్రం అక్కడి ప్రభుత్వ

కోవిడ్-19 ఉపరితల క్రిమికాలుష్యాన్ని అరికట్టడానికి యువిసి ఆధారిత బహుళార్థసాధక క్రిమిసంహారక క్యాబినెట్‌ను అభివృద్ధి చేసిన ఏఆర్సిఐ

హైదరాబాద్, జూన్ 9:ఆర్ అండ్ డి సెంటర్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం (డిఎస్టి) స్వయంప్రతిపత్తి సంస్థ అయిన ఇంటర్నేషనల్ అడ్వాన్స్డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూ మెటీరియల్స్ (ఏఆర్సిఐ), మెకిన్స్ ఇండస్ట్రీస్ తో కలిసి కోవిడ్-19 ఉపరితల క్రిమి కాలుష్యాన్ని నివారించడానికి పరిశోధనా ప్రయోగశాలలలో కీలకం కాని ఆసుపత్రి వస్తువులు, ప్రయోగశాల దుస్తులు పీపీఈ లను క్రిమిసంహారక చేయడానికి యువిసి - ఆధారిత క్యాబినెట్‌ను అభివృద్ధి చేశాయి.

వివిధ వ్యాపార సంస్థలు, షాపుల్లో వినియోగదారుల కోసం ప్రదర్శనగా పెట్టే వివిధ వస్తువులను క్రిమిరహితం (డిసిన్ఫెక్ట్) చేయడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది.

కోవిడ్-19 మార్గదర్శకాలకు అనుగుణంగా సార్స్ కోవ్2 వ్యాప్తి చెందకుండా నియంత్రించడానికి భారత్ తీసుకున్న మొదటి దశల్లో చర్యలు విజయవంతమయ్యాయి. అయితే లాక్ డౌన్ సడలించడం వల్ల ప్రజల రాకపోకలు పెరిగి ఈ మహమ్మారి నెమ్మదిగా వ్యాప్తి చెందే అవకాశం ఉంది. ఈ సందర్భంగా ఉపరితల కాలుష్యంతో అనుకోని విధంగా హాని కార పరిస్థితులు తలెత్తి నపుడు కొన్ని ఉమ్మడి వినియోగ పరికరాలు కీలక పాత్ర పోషిస్తాయి.

వ్యాధి వ్యాపించకుండా పొడిగా ఉండే రసాయన రహిత క్రిమిసంహారకం యువిసికి ప్రభావితం చేయడం ఉన్నవాటిలో మెరుగైన ప్రయత్నం. 254 ఎన్ఎం యువిసి వికరణీకరణం కోవిడ్-19 ఆర్ఎన్ఏ భాగం చేత గట్టిగా గ్రహించబడుతుంది, ఇది ఫోటోడైమెరైజేషన్ ప్రక్రియ ద్వారా పరమాణు నిర్మాణ నష్టానికి దారితీస్తుంది. తద్వారా దానిని క్రియారహితం చేస్తుంది. స్టెతస్కోప్, బీపీ మెషిన్లు, రోగుల పరీక్షల కోసం ఉపయోగించే వివిధ పరికరాలు, మొబైల్ ఫోన్లు, పర్సులు, లాప్టాప్, తిరిగి ఉపయోగించే ల్యాబ్ గ్లోవ్స్ లు, ల్యాబ్ కోట్లు, కాగితాలు తదితర వస్తువుల ఉపరితలాలను డిసిన్ఫెక్ట్ చేయడానికి యువిసి కి వాటిని ప్రభావితం చేయడమే ఉత్తమ మార్గం. యువిసి కిరణాలు ప్రసరించే తలం బట్టి డిసిన్ఫెక్ట్ ప్రక్రియ జరుగుతుంది కాబట్టి వాటి తయారీ లో ఆ జాగ్రత్తలు చేపట్టారు.

"లాక్ డౌన్ అనంతర కాలంలో వైరస్ వ్యాప్తి గొలుసును విచ్ఛిన్నం చేయడంలో సురక్షితమైన, సమర్థవంతమైన వ్యూహాలు, సాంకేతికతలు, ఉత్పత్తులు చాలా కీలకం. యువి కాంతి, ఉష్ణ చికిత్సలు, ఆధారంగా సాధారణ, సురక్షితమైన, తక్కువ ఖర్చుతో కూడిన పరిష్కారాలు ఇపుడు ముఖ్యం. ఆమోదయోగ్యమైన నాన్-క్లోరిన్ ఆధారిత క్రిమిసంహారక మందుల ఏరోసోల్ ఆవిర్లు అవసరం ఎక్కువవుతుంది" అని డిఎస్టి కార్యదర్శి ప్రొఫెసర్ అశుతోష్ శర్మ అన్నారు.

బీఎస్-6 నాలుగు చక్రాల వాహనాల నంబర్ ప్లేట్ల కోసం విభిన్నమైన రంగు

హైదరాబాద్, జూన్ 9:బీఎస్-6 నాలుగు చక్రాల వాహనాలపై, అది పెట్రోల్, డీజిల్ లేక సీఎన్‌జీ వాహనమా అన్న వివరాలు తెలిపేందుకు ఒక సెం.మీ. వెడలున్న ఆకుపచ్చ స్టికర్‌తో వివరాలు అతికించడాన్ని తప్పనిసరి చేస్తూ "కేంద్ర రహదారి రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ" ఆదేశాలు జారీ చేసింది. జూన్ 5, 2020న ఈ ఆదేశాలు వెలువడ్డాయి. ప్రస్తుతం పెట్రోలు లేదా సీఎన్‌జీ వాహనమైతే లేత బ్లూ రంగులో స్టిక్కర్ ఉంటోంది. డీజిల్ వాహనమైతే నారింజ రంగులో స్టిక్కర్ ఉంటోంది. వీటిపై ఆకుపచ్చ స్టిక్కర్ అతికించాలని కేంద్రం తన ఆదేశాల్లో పేర్కొంది.

ఏప్రిల్ 1, 2020 నుంచి అమల్లోకి వచ్చిన బీఎస్-6 ఉద్గార ప్రమాణాలు... కచ్చితమైన, శుద్ధమైన ఉద్గార నిబంధనలు కలిగివుంటాయి. ప్రస్తుతం మిగిలిన ప్రపంచం పాటిస్తున్న ఉద్గార ప్రమాణాల కంటే ఇవి ఉన్నతమైనవి. ఇతర దేశాల్లో అనుసరిస్తున్న ఈ తరహా వాహనాల ప్రమాణాలను భారత్‌లోనూ పాటించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తులు రాగా, వీటిని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది.

5000 మంది కార్మికులు, నిరుపేదలకు ఆర్ఈసీ నిత్యావసర సరుకుల పంపిణీ

హైదరాబాద్, జూన్ 9:విద్యుత్తు శాఖ పరిధిలోని కేంద్ర ప్రభుత్వ సంస్థ, విద్యుత్తు సంస్థలకు ఆర్థిక సాయమందించే దేశంలోనే అతిపెద్ద సంస్థ 'గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్' (ఆర్ఈసీ) లిమిటెడ్ యొక్క కార్పొరేట్ సమాజిక బాధ్యతలను నిర్వహించే ఆర్ఈసీ ఫౌండేషన్ ప్రస్తుత కోవిడ్ -19 వ్యాప్తి సమయంలో కార్మికులు, పేదలకు బాసటగా నిలిచేందుకు ముందుకు వచ్చింది. కోవిడ్ -19 మహమ్మారి వ్యాప్తి నేపథ్యంలో విధించిన లాక్‌డౌన్ వేళ దాదాపు 5000 మంది నిరుపేదలకు, కార్మికులకు నిత్యవసర వస్తువులతో కూడిన ప్యాకెట్లను పంపిణీ చేసేందుకు సంస్థ కంకణం కట్టుకుంది. ఈ ప్యాకెట్లలో (మేటి వస్త్రంతో తయారు చేసిన ఈ సంచీలో) తాగునీరు బాటిల్, వేంచిన శెనగలు, వేరుశెనగలు, మిక్చర్, గ్లూకోజ్ పౌడర్, పాద రక్షలు మరియు తిరిగి ఉపయోగించుకొనేందుకు వీలుండే మాస్క్‌లను అందించనున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని బ్యాంకింగేతర విత్త సంస్థ అయిన ఆర్ఈసీ లిమిటెడ్ వివిధ సహకార యత్నాల ద్వారా కార్మికులు మరియు పేదలను పోషించే మిషన్‌ను చేపడుతోంది. ఈ కార్యక్రమంలో మొదటి విడతలో భాగంగా ఈ నెల 4వ తేదీన దాదాపు 500 మంది లబ్ధిదారులకు ఇలాంటి 500 ప్యాకెట్లను పంపిణీ చేశారు. రెండో విడత కార్యక్రమాన్ని ఈ నెల 7వ తేదీన గురుగావ్ మరియు నోయిడాలలో చేపట్టారు. ఇక్కడ దాదాపు 1,000కి పైగా ఇలాంటి నిత్యవసరాలతో కూడిన ప్యాకెట్లను సరఫరా చేశారు. మిగిలిన ప్యాకెట్లు రాబోయే రోజుల్లో పంపిణీ చేయనున్నారు. సామాజిక ప్రయోజనం కోసం స్వచ్ఛందంగా నిలబడిన కార్పొరేషన్ ఉద్యోగులు ఈ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

పేదలకు వండిన భోజనం, రేషన్ పంపిణీ..

ఈ చర్యలకు అదనంగా ఆర్ఈసీ దేశ వ్యాప్తంగా వివిధ జిల్లాల అధికారులు, ఎన్జీఓలు మరియు విద్యుత్ పంపిణీ సంస్థల (డిస్కామ్స్) సహకారంతో పేదలకు వండిన భోజనం మరియు అవసరమైన రేషన్‌ను అందిస్తోంది. కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు గాను దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ ప్రకటించినప్పటి నుంచి ఆర్ఈసీ ఈ తరహా చొరవను ప్రారంభించింది. ఈనెల 6 నాటికి కార్పొరేషన్ 4.66 లక్షల కిలోగ్రాముల ఆహార ధాన్యాలు, 2.56 లక్షల భోజన ప్యాకెట్లు, 9600 లీటర్ల శానిటైజర్లు, 3400 పీపీఈ కిట్లు మరియు 83,000 మాస్క్‌లను పంపిణీ చేసింది.

ఫ్రంట్‌లైన్ హెల్త్‌కేర్ యోధులకు భోజనం..

న్యూఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది కోసం ప్రత్యేకంగా తయారు చేసిన మేటి పోషక విలువలతో కూడిన భోజన ప్యాకెట్లను పంపిణీ చేయడానికి తాజ్‌శాట్స్ (ఐహెచ్‌సీఎల్ మరియు సాట్స్ లిమిటెడ్ జాయింట్ వెంచర్ సంస్థ) తో ఆర్ఈసీ భాగస్వామ్యం కుదుర్చుకుంది. కోవిడ్-19పై పోరులో ముందుండి సేవలందిస్తున్న ఫ్రంట్‌లైన్ హెల్త్‌కేర్ యోధులకు ప్రతిరోజూ 300 ఫుడ్ ప్యాకెట్లను సరఫరా చేస్తున్నారు. వారు చేస్తున్న విశేషమైన కృషికి కృతజ్ఞత చర్యగా వీటిని చేపడుతున్నారు. ఈ చర్యల్లో భాగంగా ఇప్పటి వరకు దాదాపు 18,000 మందికి పైగా భోజనాలు పంపిణీ చేయడమైనది.

సులభ్ తరహాలో పంచాయితీల్లోనూ మరుగుదొడ్లు

కేంద్ర ఆర్థిక సాయంతో నిర్మాణాలకు రంగం సిద్ధం
పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ నిర్ణయం

వరంగల్,జూన్9(ఆర్ఎన్ఎ): తెలంగాణలో ఓ వారంపాటు మరోమారు పల్లెప్రగతి కార్యక్రమం ముగిసింది. ప్రజలను చైతన్యం చేసేలా పారిశుద్యం, పచ్చదనంపై అవగాహన కలిగించారు. పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ప్రత్యేక శ్రద్ధతో ఊరూవాడను కదిలించగలిగారు. దీంతో పారిశుద్యంపై రాష్ట్ర ప్రభుత్వం మరింత దృష్టి పెట్టింది. ప్రధానంగా పారిశుధ్య పనులు చేపట్టి ప్రజలకు మంచి వాతావరణం అందించాలని ముందుకెళ్తున్నది. అయితే నాయకులు , అధికారులు మాత్రమే ఈ కార్యక్రమంలో పాల్గొనడంతో ప్రజలను భాగస్వాములను చేయలేకపోయారు. దీనికి కరోనా కూడా కారణంగా చెప్పాలి. ఇది నిరంతర కార్యక్రమం కనుక ప్రతి గ్రామానికి, వార్డుకు బాధ్యత అప్ప గించాలి. ఒక్కోవార్డు మెంబర్ తన వార్డులో పారిశుద్యానికి బాధ్యులగా చేస్తే తప్ప ఇది విజయవంతం కాదు.

ఇదిలావుంటే ప్రతి గ్రామంలోనూ సామాజిక మరుగుదొడ్లు నిర్మించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు ఒక్కోదానికి రూ.2 లక్షల నిధులు కేటాయించింది. ప్రభుత్వ ఆదేశాలతో ఆయా గ్రామ పంచాయతీల పాలక వర్గాలకు మరుగుదొడ్ల ఆవశ్యకతపై అవగాహన కల్పించి చైతన్యం చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో సులభ్ కాంప్లెక్సుల తరహాలో ప్రతి గ్రామ పంచాయతీలోనూ వీటిని నిర్మించాలని భావించాయి. నిర్మాణ వ్యయంలో పంచాయతీలు పది శాతం నిధులు మాత్రమే భరించాలని నిబంధలనలు పేర్కొన్నారు.ఇప్పటికే కొన్ని పంచాయతీలు ముందుకు వచ్చాయి.

పరిశుభ్రత కార్యక్రమాల్లో భాగంగా ప్రతి పంచాయతీకి సామూహిక మరుగుదొడ్లు నిర్మించేందుకు కొత్త ప్రణాళిక రూపొందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో కార్యక్రమానికి త్వరలో శ్రీకారం చుట్టనున్నారు. అనేక గ్రామ పంచాయతీల్లో ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఒక్కో పంచాయతీ నుంచి రూ.2లక్షలు ఖర్చు చేసేందుకు ప్రణాళిక తయారు చేశారు. పంచాయ తీలో ఇంటింటికీ మరుగుదొడ్డి ఉన్నప్పటికీ ఇంకా నిర్మించుకోని వారికి, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లే వారికి ఈ సులభ్ కాంప్లెక్స్ ఉపయోగపడనుంది. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న స్వచ్ఛభారత్ మిషన్‌ను సద్వినియోగం చేసేందుకు కార్యాచరణను సిద్ధం చేసింది. దీనిలో భాగంగానే ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో సామాజిక మరుగుదొడ్లు నిర్మించేందుకు మార్గదర్శకాలు జారీ చేసింది. బహిరంగ మల, మూత్ర విసర్జనకు స్వస్తి పలికేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి గ్రామంలో మరుగుదొడ్లను నిర్మిస్తున్నాయి. గ్రామాల్లో సామాజిక మరుగుదొడ్లు, మూత్రశాలలు సైతం నిర్మించాలని ప్రభుత్వాలు నిర్ణయించాయి. వీటి నిర్మాణం అనంతరం ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యపర్చనున్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయిండంతో నిర్మాణాలు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలోనూ సామాజిక మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.2 లక్షల వరకు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 30 శాతం, మిగిలిన 10 శాతం పంచాయతీ భరించాలని మార్గదర్శకాల్లో పేర్కొంది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో వీటి నిర్మాణాలు జరుగనున్నాయి. వీటి అవసరాన్ని ఆయా పంచాయతీల పాలకవర్గాలకు పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులు వివరిస్తున్నారు. పంచాయతీ కార్యాలయం లేదా బస్టాండ్, జన సమూహం ఉండే ప్రాంతాల్లో ప్రభుత్వ భూమిలో వీటిని నిర్మించనున్నారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా రెండు చొప్పున మూత్రశాలలు, మరుగుదొడ్లను వేర్వేరుగా నిర్మించనున్నారు. వాటిని నిర్మించుకునేందుకు జిల్లాలో మండల కేంద్రాల పంచాయతీలు, ఇతర మేజర్ పంచాయతీలు ఇప్పటికే ఆసక్తి చూపిస్తున్నాయి. నిర్మాణం చేసిన తరువాత గ్రామంలో ఇప్పటికే ఏర్పాటుచేసిన స్థాయీ సంఘాల్లో పారిశుధ్య కమిటీకీ వీటి నిర్వహణ బాధ్యతలు అప్పగించనున్నారు.

తిరుమలలో రెండోరోజూ కొనసాగిన దర్శనాలు

నేడు స్థానిక ప్రజలకు దక్కనున్న దర్శన భాగ్యం

తిరుమల,జూన్ 9(ఆర్ఎన్ఎ): తిరుమలలో శ్రీవారి దర్శనాల ట్రయల్ రన్ రెండో రోజుకూడా చేపట్టారు. టీటీడీ ఉద్యోగులతో రాత్రి 7 గంటల వరకు ట్రయల్ రన్ నిర్వహించనున్నారు. తొలిరోజు సోమవారం శ్రీవారిని 6,360 మంది దర్శించుకోగా, మంగళవారం మరో ఆరువేల మంది టీటీడీ ఉద్యోగులు స్వామి వారిని దర్శించుకునే భాగ్యం కలిగింది. బుధవారం స్థానికులకు అవకాశం కల్పించనున్నారు.

11 నుంచి సాధారణ భక్తులను దర్శనానికి అనుమతించేలా టీటీడీ యంత్రాంగం కార్యాచరణ సిద్ధం చేసింది. సోమవారం నుంచి స్వామివారి దర్శనం పునఃప్రారంభం కాగా, టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో ఏవీ ధర్మారెడ్డి ముందుగా దర్శించుకున్నారు. ఆలయంలో టీటీడీ అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టింది. క్యూలైన్లలో నాలుగు చోట్ల శానిటైజర్లు ఏర్పాటు చేశారు. దర్శన క్యూలైన్లతో పాటు అన్న ప్రసాద కేంద్రంలో కూడా ఫుట్ ఆపరేటెడ్ కుళాయిలను టీటీడీ ఏర్పాటు చేసింది. శ్రీవారి హుండీలో కానుకలు సమర్పించే భక్తులు నాన్ ఆల్కహాలిక్ శానిటైజర్లతో చేతులు శుభ్రం చేసుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు దగ్గరగా విధులు నిర్వహించే సిబ్బందికి పీపీఈ కిట్లు పంపిణీ చేయడంతో పాటు, ప్రతి రెండు గంటలకు ఒకసారి లడ్డూ ప్రసాదాల విక్రయ కౌంటర్లను మార్చేవిధంగా చర్యలు చేపట్టారు. టీటీడీ ఆలయ పరిసరాలు, దర్శన క్యూలైన్లు, లడ్డూ కౌంటర్లు, ఇతర రద్దీ ప్రదేశాల్లో ప్రతి రెండు గంటలకు శానిటైజ్ చేస్తున్నారు భక్తులు తలనీలాలు సమర్పించే కళ్యాణకట్టలో పీపీఈ కిట్లతో క్షురకులు విధులు నిర్వహిస్తున్నారు. భక్తులు భౌతికదూరం పాటించేలా బస్టాండ్ వద్ద ఏర్పాట్లు ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. శ్రీవారి ఆలయంలోని ఉప ఆలయాలైన వకుళామాత, యోగ నరసింహస్వామి దర్శనాలను నిలిపివేశారు. తిరుమలలోని దర్శనీయ ప్రదేశాలైన శిలాతోరణం, శ్రీవారి పాదాలు, పాపవినాశనం,ఆకాశగంగకు అనుమతి లేదు.

కాణిపాకంలో

కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో కూడా రెండో రోజు ట్రయల్ దర్శనాలు కొనసాగాయి. సోమవారం 3100 మంది స్వామివారిని దర్శించుకున్నారు. మంగళవారం ఉద్యోగులు,స్థానికులు, ఉభయదారులను దర్శనానికి అనుమతించారు. లాక్‌డౌన్ పూర్తయ్యేవరకు ప్రమాణాలు చేయించడం లేదని, స్వామివారికి నిర్వహించే అర్జిత సేవలకు 30 శాతం భక్తులను అనుమతి ఇస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

శ్రీశైలంలో రెండోరోజు..

ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలం భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో రెండోరోజు ప్రయోగాత్మక దర్శనాలను ఏర్పాటు చేశారు. కరోనా నివారణ చర్యలు పాటిస్తూ స్వామిఅమ్మవార్లను స్థానికులు దర్శించుకుంటున్నారు. సాయంత్రం 4 గంటల వరకు దర్శనాలకు అనుమతి ఇవ్వనున్నారు. అలాగే రేపటి నుంచి ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకున్న భక్తులకు స్వామిఅమ్మవార్ల దర్శన భాగ్యాన్ని కల్పించనున్నారు.

జమ్ములో క్యాట్ బెంచ్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్

హైదరాబాద్, జూన్ 9:ఈశాన్య ప్రాంతం (డిఓఎన్ఈఆర్), పిఎంఓ, సిబ్బంది, ప్రజాసమస్యలు, పెన్షన్లు, అణుశక్తి, అంతరిక్ష శాఖల సహాయ (ఇండిపెండెంట్) మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఈ రోజు జమ్ము కశ్మీర్, లడాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించి 18వ బెంచిని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. క్యాట్ ప్రత్యేకంగా ప్రభుత్వ ఉద్యోగుల వ్యవహారాలే విచారించి పరిష్కరిస్తాయి కాబట్టి మిగిలిన న్యాయ స్థానాలపై కేసుల భారం తగ్గుతుందని కేంద్ర మంత్రి అన్నారు. అంతే కాకుండా బెంచ్ ఏర్పాటుతో ఈ ప్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ వ్యవహారాలు, సమస్యలు త్వరితగతిన ఒక కొలిక్కి వస్తాయని ఈ సందర్భంగా మాట్లాడుతూ చెప్పారు. మోడీ ప్రభుత్వం అందరికీ న్యాయం, పారదర్శక పాలనకు కట్టుబడి ఉందని, గడచినా ఆరేళ్లలో ప్రజల శ్రేయస్సు కోరే సంస్కరణలు ముఖ్యంగా జమ్ము కశ్మీర్ ప్రజలకు అనేక కార్యక్రమలు అమలు చేసిందని కేంద్ర మంత్రి తెలిపారు. 370, 35ఏ అధికరణలను గత ఏడాది ఆగస్టు 5న రద్దు చేశాక దేశవ్యాప్తంగా వినియోగంలో ఉన్న సుమారు 800 కేంద్ర చట్టాలు జమ్ము కశ్మీర్ కి వర్తించి ప్రజలకు ఎంతో ప్రయోజనకారిగా నిలుస్తున్నాయని ఆయన వెల్లడించారు. 30,000 వరకు పెండింగ్ లో ఉన్న కేసులను న్యాయబద్ధంగా నిర్దిష్ట కాలవ్యవధిలో పరిష్కారం అవుతాయని డాక్టర్ జితేంద్ర ప్రసాద్ తెలిపారు.

ముఖ్యమైన మూడు సంస్థలు క్యాట్ , సిఐసి, సీవీసీ కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్ము కశ్మీర్, లడాఖ్ లో ఇపుడు పనిచేస్తున్నాయని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ చైర్మన్ జస్టిస్ ఎల్. నరసింహా రెడ్డి ప్రారంభోపన్యాసం చేశారు. జమ్ము కశ్మీర్ హై కోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి జస్టిస్ గీత మిట్టల్, లెఫ్టనెంట్ గవర్నర్ శ్రీ గిరీష్ చంద్ర ముర్ము కూడా ప్రసంగించారు. క్యాట్ సభ్యుడు (జ్యూడిషియల్) శ్రీ రాకేష్ సాగర్ వందన సమర్పణ చేశారు.

సీమనీటి సమస్యలు తీర్చడానికే పోతిరెడ్డిపాడు

-తెలంగాణకు ఎలాంటి నష్టమూ లేదు
-కేంద్రమంత్రికి లేఖ రాయాలని జగన్ ఆదేశాలు

అమరావతి,జూన్9(ఆర్ఎన్ఎ): దుర్భిక్ష రాయలసీమలో ఎండిన గొంతులు తడిపేందుకే రాయలసీమ ఎత్తిపోతల పథకం చేపట్టామని వివరిస్తూ కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు లేఖ రాయాలని జలవనరుల శాఖ అధికారులను సీఎం వైఎస్ జగన్ ఆదేశించారు. మా వాటా నీళ్లను వాడుకోవడానికే ఈ ఎత్తిపోతల చేపట్టామని.. ట్రిబ్యునల్ కేటాయించిన నీటిని మాత్రమే వినియోగించు కుంటామని స్పష్టంచేయాలని దిశానిర్దేశ చేశారు. కృష్ణా, గోదావరిపై కొత్తగా చేపట్టిన ప్రాజెక్టుల మీద రెండు రాష్ట్రాలు ఆయా బోర్డులకు ఇటీవల పరస్పరం ఫిర్యాదు చేసుకున్నాయి. దీంతో ఈనెల 4న కృష్ణా బోర్డు.. 5న గోదావరి బోర్డు సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో చర్చించిన అంశాలను సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి వివరించారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం చేపట్టాల్సిన అవశ్యకతను సమగ్రంగా వివరిస్తూ కేంద్ర జల్‌శక్తి శాఖ మంత్రికి లేఖ రాయాలని సీఎం వారిని ఆదేశించారు. లేఖలో పొందుపర్చాలంటూ ముఖ్య మంత్రి పలు అంశాలను సూచించారు. ఆల్మట్టి డ్యాం ఎత్తును 519.6 మీటర్ల నుంచి 524.256 మీటర్లకు కర్ణాటక పెంచుతుండటంవల్ల అదనంగా దాదాపు 100 టీఎంసీల మేర నిల్వ చేసుకునే అవకాశం ఉంటుంది. దీనివల్ల శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం మరింత జాప్యం జరుగుతుంది. విభజన తర్వాత తెలంగాణ సర్కార్ కృష్ణాపై చేపట్టిన కొత్త ప్రాజెక్టుల కారణంగా కృష్ణాకు వరద రోజులు తగ్గాయి. శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం 881 అడుగుల్లో ఉంటేనే పోతిరెడ్డిపాడు ద్వారా ప్రస్తుత డిజైన్ ప్రకారం పూర్తి సామర్థ్యం మేరకు నీటిని తరలించే అవకాశం ఉంది. కానీ, ఆ స్థాయిలో నీటి మట్టం పది రోజులు కూడా ఉండడం లేదు. నీటి మట్టం 854 అడుగులు ఉంటే కేవలం ఏడు వేల క్యూసెక్కులు మాత్రమే వాడుకునే అవకాశం ఉంటుంది. అంతకంటే నీటి మట్టం తగ్గితే కృష్ణా బోర్డు నీటిని కేటాయించినా వాడుకునే అవకాశం ఉండదు. అందుకే 800 అడుగుల నుంచి నీటిని తరలించడానికి రాయలసీమ ఎత్తిపోతల చేపట్టామన్నారు. శ్రీశైలం జలాశయంలో 800 అడుగుల నుంచి పాలమూరు- రంగారెడ్డి, డిండి, కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా తెలంగాణ సర్కార్ నీటిని తరలిస్తోంది.

డిగ్రీ చదువుతూ ప్రేమ కలాపాలు

యువకుడితో సాన్నిహత్యంతో గర్భం దాల్చిన యువతి
తట్టుకోలేక కూతురు ప్రాణాలు తీసిన తల్లిదండ్రులు

గద్వాల,జూన్9(ఆర్ఎన్ఎ): తెలంగాణలో మరో దారుణం చోటుచేసుకుంది. వేరే కులానికి అంటే వారి దృష్టిలో తమకంటే తక్కువ కులానికి చెందిన ఓ యువకుడిని ప్రేమించినందుకు కన్న తల్లితండ్రులే సొంత కుమార్తెను దారుణంగా హత్య చేశారు. డిగ్రీ చదువుతున్న కుమార్తె గర్భం దాల్చిందని తెలిసి తల్లిదండ్రులు తలదించుకునే పరిస్థితి రావడంతో ఆగ్రహంతో కూతురిని చంపేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల జిల్లా మానవపాడు మండలం కల్లుకుంట్లకు చెందిన భాస్కర శెట్టి, వీరమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వీరిలో ఒక కుమార్తె (20) ఏపీలోని కర్నూలు పట్టణంలోని ఓ కాలేజీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. అక్కడే హాస్టల్‌లో ఉంటోంది. తోటి విద్యార్థి అయిన ఓ యువకుడిని ప్రేమించింది. మార్చ్‌లో లాక్‌డౌన్‌కి రెండు రోజుల ముందు ఇంటికి వచ్చింది. ఆ యువతిని తల్లిదండ్రులు శనివారం నాడు వైద్య పరీక్షల కోసం ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. ఆమె గర్భంతో ఉందని పరీక్షలో నిర్ధారణ కావటంతో అబార్షన్ చేసుకోవాల్సిందిగా ఒత్తిడి చేశారు. అందుకు ఆమె అంగీకరించకపోవడంతో వారు ఆమెను తీసుకొని ఇంటికి వచ్చేశారు. ఆస్పత్రి నుంచి ఇంటికి వచ్చాక యథావిధిగా మిగిలిన ఇద్దరు కుమార్తెలతో ఆరు బయట నిద్రపోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం తెల్లవారు జామున సుమారు రెండు గంటల సమయంలో.. భాస్కర శెట్టి, వీరమ్మలు తమ కూతురిని గొంతు నులిమి ఊపిరాడకుండా చేసి చంపేశారు. కూతురు చదువుకుంటానని వెళ్లి గర్భంతో రావడంతో వారు తట్టుకోలేక పోయారు. చదువుకుని ప్రయోజకురాలు అవుతుందనుకున్న సమయంలో ఇలా చేయడంతో ఎక్కడ తలదించుకోవాల్సి వస్తుందో అన్న ఆందోళనలో వారు సొంత బిడ్డను పొట్టన పెట్టుకున్నారు.

విద్యుత్ రంగంలో పరస్పర సహకారానికి భారత్, డెన్మార్క్ ఎంవోయూ

ప్రయోజనాంశాల రూపకల్పనకు ఏర్పాటుకానున్న సంయుక్త బృందం

హైదరాబాద్, జూన్ 9:విద్యుత్ రంగంలో పరస్పర సహకరించుకోవడానికి భారత్, డెన్మార్క్ నిర్ణయించాయి. భారత్, డెన్మార్క్ విద్యుత్ శాఖల మధ్య ఈ దిశగా అవగాహన ఒప్పందం కుదరింది. సమానత్వం, పరస్పర ప్రయోజనాల ప్రాతిపదికగా, బలమైన, దీర్ఘకాలిక సహకారం ఉండాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. అవగాహన ఒప్పందంపై జూన్ 5, 2020న సంతకాలు చేశాయి.

భారత్ తరపున కేంద్ర విద్యుత్ శాఖ కార్యదర్శి సంజీవ్ నందన్ సహాయ్.. డెన్మార్క్ తరపున, భారత్‌లో డెన్మార్క్ రాయబారి ఫ్రెడ్డీ స్వాన్ సంతకాలు చేశారు.

తీర ప్రాంత గాలి, దీర్ఘకాలిక విద్యుత్ ప్రణాళికలు, అంచనాలు, గ్రిడ్ అనుకూలత, విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో అనుకూలతలు, పవర్ ప్లాంట్‌ల ప్రోత్సాహం, పునరుత్పాదక ఇంధన ఉత్పత్తిలో వైవిధ్యం వంటి అంశాల్లో రెండు

దేశాల మధ్య సహకారాన్ని ఎంవోయూ ప్రోత్సహిస్తుంది. ఈ అంశాల్లో భారతీయ విద్యుత్ మార్కెట్ డెన్మార్క్ నుంచి లబ్ధి పొందుతుంది.

గుర్తించిన అంశాలను వృద్ధి చేసేందుకు, సంయుక్త కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేయనున్నారు. రెండు దేశాల కార్యదర్శి స్థాయి అధికారులు ఈ బృందానికి అధ్యక్షులుగా, సంయుక్త కార్యదర్శి స్థాయి అధికారులు ఉపాధ్యక్షులుగా వ్యవహరిస్తారు. వీరు స్టీరింగ్ కమిటీకి నివేదిస్తారు.

విద్యుత్ రంగంలోని గుర్తించిన అంశాల్లో పరస్పరం ప్రయోజనాలు పొందేలా వ్యూహాత్మక, సాంకేతిక సహకారాన్ని ప్రోత్సహించడానికి రెండు దేశాలు చర్యలు తీసుకుంటా

పోచారం డ్యామ్‌లోకి కాళేశ్వరం నీళ్లు

–బ్రిడ్జి ప్రారంభోత్సవంలో మంత్రి హరీష్

మెదక్,జూన్9(నేటినిజం ప్రతినిధి): ఎస్సారెస్పీ, కొండపోచమ్మ సాగర్ ద్వారా పోచారం డ్యామ్ నింపి ఈ ప్రాంత రైతులకు పంటల సాగుకు నీరందిస్తామని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. మెదక్ మండల పరిధి రాజ్‌పేట్ శివారులో రూ.5.50 కోట్లతో నిర్మించిన బ్రిడ్జిని ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ ధర్మారెడ్డితో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల హయాంలో ఎన్నోసార్లు రాజ్ పేట్ బ్రిడ్జి పనులకు శంకుస్థాపనలు చేసినా పనులు మాత్రం జరగలేదన్నారు.

కానీ టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రూ.5.50 కోట్ల నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు.

రాష్ట్రంలో అన్ని ప్రాజెక్టుల కంటే పోచారం ప్రాజెక్ట్ ముందుగా నిండుతుందని, అయినప్పటికి ఈ డ్యామ్ పరిసర ప్రాంత రైతులకు కొండపోచమ్మసాగర్ ద్వారా హల్దీ, ఎంఎస్ కెనాల్ మీదుగా ప్రాజెక్టును నింపి సాగు నీరు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఏసీ నగేష్, జడ్పీ వైస్ చైర్ పర్సన్ లావణ్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెదక్ మండల పరిధిలోని రాజ్‌పేట శివారులో నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించిన మంత్రి హరీష్ రావు. చిత్రంలో ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పోలవరం కోసం మేఘా కృషి అభినందనీయం

ప్రత్యేక రైలు ద్వారా కార్మికులను రప్పించిన సంస్థ
ఊపందుకున్న పోలవరం స్పిల్‌వే పనులు
మేఘా ఇంజినీరింగ్ సంస్థను అభినందించిన మంత్రి మేకపాటి

అమరావతి,జూన్9(ఆర్ఎన్ఎ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను మళ్లీ ప్రారంభించేందుకు నిర్మాణ సంస్థ మేఘా ఇంజనీరింగ్ కంపెనీ చేస్తున్న ప్రయత్నాలను రాష్ట్ర మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి అభినందించారు. ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్లి పోయిన సుమారు 1500 మంది వలస కార్మికులను ప్రత్యేక రైలు ద్వారా పోలవరం నిర్మాణ పనులు కొనసాగుతున్న ప్రాంతానికి మెగా ఇంజనీరింగ్ సంస్థ తరలించింది. వలస కార్మికులను తరలించడంతో పాటు నిర్మాణ పనులను వెంటనే చేపట్టింది. మేఘా ఇంజినీరింగ్ సంస్థ చూపిన చొరవ కారణంగా పోలవరం నిర్మాణ పనుల్లో పురోగతి కనిపిస్తుందని రాష్ట్ర మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి వ్యాఖ్యానించారు. నిర్మాణ పనులను చేపట్టేందుకు మేఘా ఇంజినీరింగ్ సంస్థ యాజమాన్యాన్ని మంత్రి అభినందించారు. మేఘా సంస్థ ప్రాజెక్ట్‌లోని ప్రధానమైన పనులకు ఆటంకం రాకుండా అధిగమిస్తోంది. స్పిల్‌వే, స్పిల్ ఛానెల్, అప్రోచ్ చానెల్, పైలెట్, చానెల్స్, ఎర్త్‌కమ్ ర్యాక్‌ఫిల్ డ్యాం 1,2,3(గ్యాప్‌లు) ప్రాంతాలతో పాటు గతంలో పూర్తిగా నిలిచిపోయిన జల విద్యుత్ కేంద్ర నిర్మాణ పనులు సైతం మొదలయ్యాయి.

గతంలో స్పిల్‌వే, కాఫర్ డ్యాం పనులు కొంత మేరకు జరగడం నహా మిగిలిన పనులేవి ప్రారంభించనేలేదు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వం పట్టిన పనులను రద్దు చేసి కొత్తగా టెండర్లు పిలిచారు. దాని వల్ల వ్యయం తగ్గించడంతో పాటు అన్ని పనులు ముమ్మరం అయ్యే విధంగా చర్యలు చేపట్టారు. ప్రపంచంలోనే అతిపెద్ద స్పిల్‌వే పోలవరం ప్రాజెక్ట్‌లో అంతర్భాగంగా ఉంది. దీన్ని చేపట్టిన మేఘా ఇంజనీరింగ్ సంస్థ లక్ష్యం మేరకు ప్రణాళికబద్ధంగా పనులు సాగిస్తోంది. ఈ ప్రాజెక్ట్‌లో 50 లక్షల క్యూసెక్కుల వరద నీరు ప్రవహించే విధంగా స్పిల్‌వే నిర్మిస్తున్నారు. 2019 నవంబర్‌లో మేఘా పనులను ప్రారంభించింది. అప్పటికే జలాశయ నిర్మాణ ప్రాంతంలో ముందు, వెనకా వరద నీరు చేరింది. దాని వల్ల దాదాపు 4 టీఎంసీల నీటిని ఎత్తిపోయడానికే అధిక సమయం పట్టింది. ఆ తరువాత జనవరిలో పనులు వేగవంతమయ్యాయి. నిర్మాణ పనులకు వేసవి కాలం ముఖ్యంగా మార్చి, ఏప్రిల్, మే నెలలు కీలకమైనవి. కానీ కరోనా కష్టాలతో దేశ వ్యాప్తంగా ప్రాజెక్ట్ నిర్మాణ పనులు మందగించాయి. పోలవరం నిర్మాణంపై కూడా ఈ ప్రభావం కొంత పడింది. అతిపెద్ద ప్రాజెక్ట్ కావడంతో వేల మంది కార్మికులు ఇక్కడ పని చేస్తున్నారు. కరోనా నేపథ్యంలో 2 వేల మంది కార్మికులు తమ సొంత రాష్ట్రాలైన బీహార్, జార్ఖండ్, ఒరిస్సాకు వెళ్లిపోయారు. దాని వల్ల అతికొద్ది మంది కార్మికులు, సిబ్బందితోనే పనులు చేయించాల్సి వచ్చింది. అయినా పనులు ఆగిపోకుండా ముందుకు సాగాయి. ఇందులో అటు రాష్ట్ర ప్రభుత్వం, ఇటు మేఘా ఇంజనీరింగ్ సంస్థ సమర్థంగా వ్యవహరించాయి. పనుల్లో స్పిల్‌వే, స్పిల్ ఛానెల్, జల విద్యుత్ కేంద్రం, మట్టి, రాతి పనులు ఈ కాలంలో చెప్పుకోదగ్గ స్థాయిలోనే జరిగాయి. నవంబర్–డిసెంబర్‌ల్లో నీటి సమస్య వల్ల పనులు నెమ్మదిగా జరిగాయి. ఏప్రిల్, మే నెలలో కరోనా ప్రభావం పోలవరంపై పడకుండా అటు నిర్మాణ సంస్థ, ఇటు ప్రభుత్వం సమర్థంగా వ్యవహరించాయి. కరోనాతో ప్రాజెక్ట్‌లకు ఒక్క కార్మికుల సమస్యలే కాదు... మిగిలిన ఇబ్బందులు వచ్చాయి. సిమెంట్, స్టీల్ ఇతర వస్తువుల సరఫరాపై తీవ్ర ప్రభావం చూపింది. రవాణా వ్యవస్థ ఏప్రిల్, మేల్లో స్తంభించిపోయింది. ప్రాజెక్ట్‌కు అవసరమైన ముడిసరుకు చేరకపోవడంతో అనేక అవరోధాలు ఎదురయ్యాయి. పనులు అనుకున్న స్థాయిలో చేయలేకపోయారు. ప్రభుత్వ యంత్రాంగం, కంపెనీ సిబ్బంది దానిని అధిగమించడానికి శతవిధాలా ప్రయత్నించాల్సి వచ్చింది. కార్మికుల కోసం జిల్లా వైద్య సిబ్బంది, మేఘా సంస్థ ప్రత్యేకంగా వైద్యసిబ్బందితో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసింది. కార్మికులకు ప్రత్యేక ఇన్సెంటివ్స్ కూడా ఇస్తున్నారు. స్పిల్ ఛానెల్‌కు సంబంధించిన కాంక్రీట్ బ్లాక్ నిర్మాణం కూడా క్రియాశీల దశకు చేరుకుంది. 960 మెగావాట్ల జల విద్యుత్ కేంద్రాన్ని పోలవరం ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మించాలి. ఇందుకోసం ఒక్కొక్కటి 80 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 12 వర్టికల్ కఎ÷–లాంగ్ టర్బైన్లను ఏర్పాటు చేయాలి. పోలవరం ప్రాజెక్టును అనుకున్న సమయానికి ఎలాగైనా పూర్తి చేయాలనే సంకల్పంతో ఉన్న మేఘా సంస్థ దాదాపు 2000 మంది కార్మికులను ప్రత్యేక రైళ్ల ద్వారా తిరిగి వెనక్కు తీసుకొచ్చింది. ఇలా వచ్చినవారికి ఇతర సదుపాయాలను కూడా కల్పిస్తున్నారు. అలాగే ప్రత్యేక మెడికల్ టీం ఏర్పాటు చేసి అన్ని రకాల పరీక్షలు నిర్వహించిన తరువాతనే పనుల్లోకి అనుమతిస్తున్నారు. పనిచేస్తున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతుండడంతో పనులను మరింత వేగవంతం చేయనున్నారు.

హైదరాబాద్‌లో కరోనాతో జర్నలిస్ట్ మనోజ్ మృతికి సంతాపం తెలిపిన ప్రకాశం జిల్లా జర్నలిస్ట్ సంఘాల నేతలు

కరోనాపై హైకోర్టు ఆదేశాలను అమలు చేయండి

టెస్టులు ఎందుకు తక్కువ చేస్తున్నారో చెప్పాలన్న ఉత్తమ్
కుట్రదారులు ఎవరో తేల్చాలన్న భట్టి విక్రమార్క

హైదరాబాద్,జూన్9(ఆర్ఎన్ఎ): ప్రజారోగ్యంతో ఆటలాడటం ప్రభుత్వానికి తగదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. కరోనా పరీక్షల విషయంలో ఇప్పటికైనా హైకోర్టు సూచనలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కరోనా పరీక్షల విషయంలో తమ ఆదేశాలు అమలు కావడం లేదంటూ హైకోర్టు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భంగా ఉత్తమ్ ప్రభుత్వ పై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనా టెస్టులపై హైకోర్టు ఆదేశాలను బేఖాతరు చేస్తారా? మీ ఇష్టమొచ్చినట్టు పాలించడానికి మనం రాచరికంలో లేమంటూ ఆరోపించారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడొద్దన్న ఉత్తమ్ కోర్టు ఆదేశాలను వెంటనే అమలుపర్చాలని డిమాండ్ చేశారు. కరోనా కేసులను దాచడంతో పాటు, చనిపోయిన వారికి ఎందుకు టెస్టులు చేయరని అన్నారు. అలాగే మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో అతితక్కువ టెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. ఇదిలావుంటే కరోనాపై కుట్ర చేస్తున్నారంటున్న సిఎం కెసిఆర్...ఆ కుట్రదారుడెవరో చెప్పాలని కాంగ్రెస్ సీనియర్ నేత భట్టి విక్రమార్క అన్నారు. డాక్టర్లు, పారామెడికల్ స్టాఫ్‌కు కరోనా వచ్చింది వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కరోనాతో తెలంగాణ అతలాకుతలమైందని, రాష్ట్రంలో వైరస్‌ను నియంత్రించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని భట్టి విక్రమార్క ఆరోపించారు. సీఎం కేసీఆర్ ప్రగతిభవన్లఓ క్షేమంగానే ఉంటారని, మరి ప్రజల సంగతేంటని ప్రశ్నించారు. కరోనా విజృంభిస్తుంటే సరైన సదుపాయాలు ఏర్పాటు చేయకుండా ఏం చేస్తున్నారని నిలదీశారు.సీఎం, మంత్రులు ఎక్కడుంటున్నారో తెలియదన్నారు. ప్రజాసమస్యలపై మంత్రులకు ఫోన్లు చేస్తే ఎత్తరని పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచి రెండేళ్లయిందని.. ముఖ్యమంత్రి, మంత్రులు ఎక్కడ ఉంటారో తెలియదని భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజా సమస్యలు చాలా ఉన్నాయని, ఎవరికైనా పిటిషన్ పంపిద్దామంటే ఎవరు ఎక్కడుంటారో తెలియడం లేదన్నారు. ల్యాండ్‌లైన్‌కి ఫోన్ చేస్తే.. అది పనిచేయదని, మొబైల్ ఫోన్.. వాళ్లు ఎత్తరని విమర్శించారు. కరోనాపై కుట్ర చేస్తున్నారని ఆరోపిస్తున్నారని.. ఆ కుట్ర ఎవరు చెస్తున్నారో చెప్పాలని, ఆ కుట్ర ఏంటో బయటకు చెప్పాలని డిమాండ్ చేశారు.

కరోనాపై హైకోర్ట్ ఆదేశాలు పాటించాలి

కరోనాపై వాస్తవాలు దాయడం మంచిది కాదు
టెస్టుల సంఖ్యను పెంచితే రోగుల సంఖ్య తేలేది
కరెంట్ బిల్లుల విషయంలో మంత్రి తీరు దారుణం –కోదండరామ్

హైదరాబాద్,జూన్9(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో పెరుగుతున్న కరోనా కేసుల నేపథ్యంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం అన్నారు. రాష్ట్రంలో కరోనా పరీక్షలు పెంచాలని, పరీక్షల పూర్తి వివరాలు అందించాలని కోర్టు ఆదేశించినా.. ప్రభుత్వం మిన్నకుండడం సరికాదన్నారు. కరోనా నిర్మూలన కోసం హైకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి జిల్లా కేంద్రంలో కరోనా చికిత్స అందించాలని, ప్రజారోగ్యం పై ప్రభుత్వం ఇంకా ఎక్కువగా ఖర్చు చేయాలని అన్నారు. జిహెచ్ఎమ్‌సీలో

కరోనా కేసులు పెరుగుతుండడంపై ప్రజలు భయపడుతున్నారన్నారు. కరోనా టెస్టులు చేస్తేనే కేసుల వివరాఉల బయటపడతాయన్నారు. అప్పుడే ప్రజలు మరింత జాగ్రత్తగా ఉంటారని అన్నారు. కరోనా టెస్టుల విషయంలో దాపరికాలు సరికాదన్నారు. ఈ విషయంలో ప్రజలకు అన్ని వివరాలు తెలపాలన్నారు. ఇకపోతే రాష్ట్రంలో కరెంటు బిల్లుల పెరుగుదల ఆవేదనలకు గురిచేస్తోందని కోదండరాం అన్నారు. కరోనా భయంతో లాక్ డౌన్ ఎత్తేసినా.. ఆర్థిక కార్యకలాపాలు ఇంకా పుంజుకోలేదన్నారు. మూడు నెలల బిల్లు ఆవరేజ్ చేసే సరికి శ్లాబులు మారిపోయాయని అన్నారు. బిల్లు కట్టకపోతే కరెంటు కట్ చేస్తామని మంత్రి జగదీశ్ రెడ్డి అనడం సరికాదన్నారు. 100 యూనిట్ల వరకు ఉపయోగించే వాళ్లకు ప్రభుత్వం ఫ్రీ విద్యుత్ అందించాలని, 200 యూనిట్ల వరకు సగం బిల్లు ఇవ్వాలన్నారు. టెలిస్కోపిక్ విధానాన్ని అమలు చేసి? నాన్ టెలిస్కోపిక్ పద్ధతిని రద్దు చేయాలని చెప్పారు. కనీసం ఈ నాలుగు నెలలైనా ఈ విధానం అమలు చేయాలని ప్రభుత్వాని కోరారు. కరోనా వైరస్ బారిన పడి మరణించిన జర్నలిస్ట్ మనోజ్ మృతిపై సంతాపం వ్యక్తం చేస్తూ.. అతని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొవాలని కోదండరాం అన్నారు.

నాటు సారా తయారీ కేంద్రాలపై ఆబ్కారీ శాఖ దాడులు

వనపర్తి : జిల్లాలో నాటు సారా తయారీ కేంద్రాలపై ఆబ్కారీ శాఖ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తయారీ కేంద్రాల పై దాడులు నిర్వహించి సారా తయారీ ముడిసరుకులను ధ్వంసం చేస్తున్నారు. తాజాగా జిల్లాలోని ఖిలాఘనపూర్ మండలం దొంతికుంట తండాలో ఆబ్కారీ శాఖ అధికారుల దాడులు నిర్వహించారు.

ఈ దాడుల్లో 335 కేజీల చక్కెర, 25కేజీల బెల్లం, 20 కేజీల నవసాగరం స్వాధీనం చేసుకున్నారు.1570 లీటర్ల పానకాన్ని ధ్వంసం చేశారు. సారా తయారు చేస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ గణేష్ తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మినా, సారా తయారు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రేటర్‌లో ఆందోళన కలిగిస్తున్న కరోనా కేసులు

వరుసగా పెరుగుతున్న పాజిటివ్ కేసుల సంఖ్య
మరోమారు లాక్‌డౌన్ తప్పదంటూ పుకార్లు షికారు

హైదరాబాద్,జూన్9(ఆర్ఎన్ఎ): గ్రేటర్‌పై కరోనా వైరస్ పంజా విసురుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. ఎక్కడ ఎవరిద్వారా వ్యాప్తి చెందుతుందో అన్న భయం నెలకొంది. అలాగే కాంట్రాక్ట్‌లను గుర్తించడం కూడా కష్టంగా మారింది. దీంతో గతవారం రోజులుగా రికార్డు స్థాయిలో పాజిటివ్ కేసులు నమోదవుతూనే ఉన్నాయి. చివరకు జిహెచ్ఎంసి, సచివాలయ ఉద్యోగులకు కూడా కరోనా పాజిటివ్ రావడంతో ఉద్యోగుల్లో సైతం భయం నెలకొంది. దీంతో చాలామంది మళ్లీ విధులకు రావాలంటేనే ఆందోళన చెందుతున్నారు. మరోవైపు నగరంలో మరోమారు పూర్తిస్థాయిలో లాక్‌డౌన్ విధిస్తారన్న ప్రచారం సాగుతోంది. గ్రేటర్‌పరిధిలో పెరుగుతున్న కేసులతో లాక్‌డౌన్ విధించే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. టెస్ట్ పరీక్షలు కూడా పూర్తిగా రద్దు కావడంతో ఇక లాక్‌డౌన్ విధించినా పెద్దగా సమస్యలు రావని అంటున్నారు. అయితే ఇందులో నిజానిజాలు ప్రభుత్వం తీసుకునే నిర్ణయం మేరకు ఆధారపడి ఉంటుంది. ప్రజలు వ్యక్తిగత భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడం లేదన్న ఆరోపణలూ ఉన్నాయి. అందుకే కేసులు పెరుగుతున్నాయని అంటున్నారు. సోమవారం కింగ్‌కోఠి ఆస్పత్రి ఓపీకి 202 మంది రోగులు రాగా, వీరిలో 32 మందిని ఇన్‌పేషంట్లుగా అడ్మిట్ చేశారు. ఇప్పటికే ఇక్కడ చికిత్స పొందుతున్న 24 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వీరిలో ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. నెగిటివ్ వచ్చిన 18 మందిని డిశ్చార్జ్ చేశారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 88 మంది అనుమానితులు ఉన్నారు. కరోనా అనుమానిత లక్షణాలతో బాధపడుతూ ఫీవర్ ఆస్పత్రికి 56 మంది రాగా, వీరిని ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. ప్రస్తుతం ఆస్పత్రి ఐసోలేషన్ వార్డులో ఉన్న 13 మందికి పాజిటివ్ నిర్ధారణ అయింది. మరో 64 మంది అనుమానితులను ఐసోలేషన్‌లో ఉంచారు. కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయి స్వల్ప లక్షణాలతో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 393 మందిని డిశ్చార్జ్ చేసి, హోం క్వారంటైన్‌కు తరలించారు. నల్లకుంటలోని ఫీవర్ ఆసుపత్రిలో సోమవారం 54 కోవిడ్19 అనుమానిత కేసులు నమోదయ్యాయి. కోవిడ్ హెల్ప్ డెస్క్ వద్ద స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి కోవిడ్ లక్షణాలు కనిపించిన వారిని ఐసోలేషన్ వార్డుకు తరలించారు. పాత కేసులతో కలిపి ప్రస్తుతం ఐసోలేషన్ వార్డులో 64 మంది అనుమానితులు వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. ఇదిలా ఉండగా ఆదివారం నమోదైన అనుమానితుల్లో మొత్తం 13 మందికి పాజిటివ్ అని నిర్ధారణ అయ్యింది. పాజిటివ్ వచ్చిన వారిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏడుగురు వ్యక్తులకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. సయ్యద్‌నగర్‌కు చెందిన మహిళ(37) తల్లికి వారం రోజుల క్రితం కరోనా సోకడంతో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇటీవల డిశ్చార్జి అయింది. సోమవారం ఆమె కుమార్తెకు కరోనా పాజిటివ్ రావడంతో కింగ్‌కోఠి ఆస్పత్రికి తరలించారు. మాజీ ఎంపీ మురళీమోహన్ కుమారుడి ఇంట్లో పని చేస్తున్న ముగ్గురు పని మనుషులకు పాజిటివ్ వచ్చింది. వీరిలో ఇద్దరు భార్యా, భర్తలు కాగా మరో మహిళ వంట మనిషిగా పని చేస్తోంది. టోలిచౌకికి చెందిన వృద్ధుడికి(75), బంజారాహిల్స్ రోడ్ నెం. 14లో నివాసం ఉంటున్న మరో యువతికి కరోనా పాజిటివ్ వచ్చింది. అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి (49)కు కరోనా పాజిటివ్ వచ్చింది. శివాజీనగర్‌కు చెందిన వ్యక్తి గత కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు ఉస్మానియా ఆసుపత్రిలో అతడికి వైద్య పరీక్షలు నిర్వహించగా కరోనా పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. దీంతో శివాజీనగర్‌లోని అతడి కుటుంబసభ్యులను అధికారులు హోం క్వారంటైన్ చేశారు. యూసుఫ్‌గూడ సర్కిల్ 19 పరిధిలో ఇద్దరు వ్యక్తులు కరోనా బారిన పడ్డారు. జవహర్‌నగర్ బస్తీకి చెందిన యువకుడు(27), హైలాం కాలనీకి చెందిన వ్యక్తి (54)కి కరోనా పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. శేరిలింగంపల్లి మండల పరిధిలో సోమవారం మూడు కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. సుదర్శన్‌నగర్ కాలనీకి చెందిన మహిళ (46), మియాపూర్ న్యూకాలనీకి చెందిన యువకుడు(26), ఇజ్జత్‌నగర్‌కు చెందిన వ్యక్తి(35) కరోనా బారిన పడ్డారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో సోమవారం రెండు కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీకి చెందిన మహిళ(45)కు, జిల్లెలగూడ దాసరి నారాయణరావుకాలనీకి చెందిన బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వ్యక్తికి (35) కరోనా పాజిటివ్ రావడంతో వారి ఇళ్లను క్వారంటైన్ చేశారు. కిషన్‌బాగ్ డివిజన్‌లోని అసద్‌బాబానగర్‌లో ఓ వృద్ధుడి (65)కి కరోనా పాజిటివ్ రావడంతో గాంధీ ఆసుపత్రిలోని ఐసోలేషన్ వార్డుకు తరలించారు. బహదూర్‌పురా పీఎస్‌లో కానిస్టేబుల్‌కు (52)కు కూడా ఆదివారం రాత్రి కరోనా పాజిటివ్ రావడంతో గాంధీ ఆసుపత్రికి తరలించారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో సోమవారం మరో 9 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఆదివారం రాంనగర్ మీసేవా వద్ద నిమ్స్‌లో పనిచేసే ఓ నర్సుకు కరోనా సోకగా, సోమవారం ఆమె సోదరికి పాజిటివ్ నిర్ధారణ అయ్యింది. కవాడిగూడకు చెందిన మహిళ(34) గాంధీనగర్‌లో (65) ఏళ్ల వ్యక్తికి కరోనా సోకింది. ఉస్మానియా ఆస్పత్రిలో హౌస్ సర్జన్‌గా పనిచేస్తూ ఫ్రెండ్స్‌కాలనీలో ఉంటున్న యువకుడి(24)కి, భోలక్‌పూర్‌లో ఓ వ్యక్తికి (53, అడిక్‌మెట్ లలితానగర్‌లో మరో వ్యక్తి(48)కి పాజిటివ్ వచ్చింది. బీర్బన్ గల్లీలో ఉంటున్న హౌస్ సర్జన్(26)కు, భోలక్‌పూర్‌కు చెందిన (52) వ్యక్తికి, లలితానగర్‌కు చెందిన జీహెచ్ఎంసీ ఉద్యోగి కరోనా బారిన పడ్డారు. కూకట్‌పల్లి సర్కిల్‌లో బిల్లు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తికి కరోనా పాజిటివ్ వచ్చింది. దీంతో అధికారులు సదరు బిల్లు కలెక్టర్‌కు ఎవరి నుంచి వ్యాధి సోకిందనే వివరాలు సేకరిస్తున్నారు. మిర్జాల్‌గూడ రాజా శ్రీనివాస్‌నగర్‌కు చెందిన వైద్యుడికి (30) కరోనా నిర్ధారణ అయ్యింది. అతను నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో విధులు అధికారులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఇదిలావుంటే కరోనా విస్తరించే ప్రమాదం ఉన్నందున కనీసం రెండునెలల పాటు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మజ్లిస్ అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సూచించారు. యువ జర్నలిస్ట్ మరణం తనను కలచివేసిందని.. వృత్తి ధర్మం కోసం తన ప్రాణాన్నే త్యజించాడని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. జర్నలిస్ట్ కుటుంబీకులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతున్ని కోరుతున్నానన్నారు. జర్నలిస్టులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జర్నలిస్టులకు ఏదైనా సాయం కావాలంటే తనను

తెలంగాణ బాటలోనే తమిళనాడు

టెన్త్ పరీక్షలు రద్దు.విద్యార్థులకు పాస్ ప్రమోషన్
వెల్లడించిన సిఎం పళనిస్వామి

చెన్నై,జూన్9(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో కరోనా మహమ్మారి విజృంభిస్తున్న కారణంగా పదో తరగతి పరీక్షలను రద్దు చేస్తున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి పళనిస్వామి ప్రకటించారు. విద్యార్థుల ందరినీ పై తరగతులకు ప్రమోట్ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీంతో ఆ రాష్ట్రంలో చదువుతున్న 9 లక్షల మంది విద్యార్థులకు పరీక్షల నుంచి ఉపశమనం లభించినట్లయింది. అలాగే క్లాస్ 11 తరగతుల పరీక్షలు కూడా రద్దు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. 'విద్యార్థుల ప్రాణాలను దృష్టిలో ఉంచుకొని పదో తరగతి తరగతి పరీక్షలను రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. పరీక్షలు నిర్వహించకుండానే పై తరగతులకు ప్రమోట్ చేస్తున్నాం. క్వార్టర్లీ, హాఫ్ ఇయర్లీ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా 80శాతం మార్కులు, హాజరు ఆధారంగా 20శాతం మార్కులు లెక్కగడతామని ముఖ్యమంత్రి వెల్లడించారు. తొలుత జూన్ 15 నుంచి పరీక్షలు నిర్వహించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. అయితే కొవిడ్ విజృంభణను దృష్టిలో పెట్టుకుని పరీక్షల నిర్వహణ వాయిదాను పరిశీలించాలని మద్రాస్ హైకోర్టు ప్రభుత్వానికి సూచించింది. ఈ నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ నిపుణులతో ముఖ్యమంత్రి చర్చించారు. ఇప్పట్లో వైరస్ తగ్గుముఖం పట్టే అవకాశాలు లేవని వారు స్పష్టం చేయడంతో ప్రభుత్వం ఈ నిర్ణయానికి వచ్చింది. పరీక్షలు నిర్వహించేం దుకు ప్రభుత్వం సమాయత్తమవడాన్ని తమిళనాడులో ప్రతివక్షాలు కూడా తీవ్రంగా తప్పుపట్టాయి. సోమవారం డీఎంకే నేత ఎంకే స్టాలిన్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ మోడల్ తరహాలో ఇక్కడి విద్యార్థులను కూడా పరీక్షలు లేకుండానే పాస్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 3,650 కేసులున్న తెలంగాణలోనే పరీక్షలు రద్దు చేసినప్పుడు. 33,229 కేసులున్న తమిళనాడులో పరీక్షలను నిలిపివేయడమే సముచితమని స్టాలిన్ అభిప్రాయపడ్డారు.

శ్రీశైలంలో నిత్యావసర వస్తువుల పంపిణీ చేసిన ఉపాసన

శ్రీశైలం,జూన్9(ఆర్ఎన్ఎ): దాదాపు 75 రోజుల తర్వాత శ్రీశైలం మల్లన్న ఆలయం తెరుచుకొని ప్రయోగాత్మకంగా దర్శనాలకు అనుమతి ఇస్తున్నారు. గంటకు 300 మంది చొప్పున భక్తులను స్వామి, అమ్మవార్ల దర్శనానికి పంపుతున్నారు. భక్తులు తప్పనిసరిగా భౌతిక దూరం పాటిస్తూ ముఖాలకు మాస్క్‌లను ధరిస్తు న్నారు. ఆలయం ఆవరణలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఉద్యోగులకు శ్రీశైలం దేవస్థానం ఈవో కేఎస్ రామారావు ఆదేశాలు జారీచేశారు. మంగళవారం ఉదయం ముఖానికి మాస్క్ ధరించి వచ్చిన మెగాస్టార్ చిరంజీవి కోడలు,రామ్‌చరణ్ సతీమణి ఉపాసన కొణిదెల స్వామివారిని దర్శించుకొన్నారు. చాలా రోజుల తర్వాత శ్రీశైలం మల్లన్నను దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉన్నదని ఉపాసన ఈ సందర్భంగా తనను కలిసిన మీడియాతో అన్నారు. అనంతరం స్థానిక చెంచులు, ఆలయ ఉద్యోగులు, స్థానిక ప్రజలకు పెద్ద మొత్తంలో నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. పోలీసులకు మాస్క్‌లతోపాటు పీపీఈ కిట్లను అందజేశారు.

కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ప్రజలు ఇంటిపట్టునే ఉంటూ జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు.

కూరగాయల మార్కెట్లోకి దూసుకెళ్లిన కారు

హైదరాబాద్,జూన్9(ఆర్ఎన్ఎ): చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బాగ్ లింగంపల్లి అంబేద్కర్